
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 21 సెప్టెంబరు 2025

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

- జిల్లా అధికారులతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సమావేశం
- సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర, రాష్ట్ర ఐటీ మంత్రులు హాజరు
- దేశం నలుమూలల నుంచి వివిధ రంగాల నిపుణులు, అతిథులు సుమారు వెయ్యి మంది రాక

-6లో



మాట్లాడుతున్న కాటంనేని భాస్కర్

హెల్త్ సెంటర్స్‌లో అందని సేవలు

పట్టణ ఆరోగ్య కేంద్రాలపై పర్యవేక్షణ కరువు



పిఠాపురం కాలనీ 22వ వార్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

- అనేకచోట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- అనధికారికంగా విధులకు డుమ్మా
- ఏడుగురు ఉండాల్సిన చోట్ల ఇద్దరు, ముగ్గురే ఉంటున్నవైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధులకు ఎగనామం పెడుతూ రోగులకు వైద్య సేవలను దూరంచేస్తున్నారు. పట్టణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో 66 చోట్ల అర్బన్ హెల్త్ సెంటర్స్‌ను ఏర్పాటుచేశారు. ఒక్కో సెంటర్‌కు ఏడుగురు సిబ్బంది (ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, లాస్ట్ గ్రేడ్ సర్వీస్) ని కేటాయించారు. వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలు అందించాలి. అయితే, అనేక అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల స్టాఫ్ నర్సులు, మరికొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు ఉండకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు.

తాజాగా పిఠాపురం కాలనీలో గల సెంటర్‌కు ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలకు వెళ్లగా, వైద్యురాలితోపాటు స్టాఫ్ నర్సులు అందుబాటులో లేకపోవడం గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. అయితే, ఈ తరహా పరిస్థితి అనేక అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉందని చెబుతున్నారు. కొందరు ఉదయం విధులకు హాజరై అటెండెన్స్ వేసుకుని వ్యక్తిగత వ్యవహారాలపై దృష్టిసారిస్తూ బయటకు వెళ్లిపోతు న్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

రోగుల పాట్లు

అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో 64 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే సదుపాయం ఉంది. రోగులకు 172 రకాల మందులను అందించాల్సి ఉంటుంది. అయితే కొన్నిచోట్ల మెరుగ్గా సేవలు అందిస్తుంటే, కొన్నిచోట్ల అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావును వివరణ కోరగా అర్బన్ హెల్త్ సెంటర్స్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో సిబ్బంది అందుబాటులో లేకపోతే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.



నైట్ ఫుడ్‌కోర్టు తొలగించడంతో ఖాళీగా మారిన పాతజైలురోడ్డు

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

మూడో రోజు 706 దుకాణాలు...

- ఆక్రమణలు తొలగించడంతో విశాలంగా కనిపిస్తున్న రోడ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాల తొలగింపు ప్రక్రియ మూడో రోజు కూడా కొనసాగింది. 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. శనివారం భీమిలి జోన్ పరిధిలోని తగరపువలస ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డులో 35, భీమిలి క్లాక్‌టవర్ వద్ద 16 ఆక్రమణలను జీవీఎంసీ డీసీపీ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. అలాగే జోన్-2 పరిధిలో మిధిలాపురి వుడా కాలనీ రోడ్డులో 22, పెదగదిలి, తోటగరువు జంక్షన్లలో 48 ఆక్రమణలను తొలగించారు. జోన్-3 పరిధిలో సీతమ్మధార రైతుబజార్ నుంచి గురుద్వారా జంక్షన్ వరకు 27, ఎస్ఆర్ఐ ఆస్పత్రి నుంచి గురుద్వారా వరకు 15, పోర్టు సేడియం రోడ్డు నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు 18 ఆక్రమణలను డీసీపీ మధుసూదనరావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. జోన్-4 పరిధి పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్టులో 157 దుకాణాలను, అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 32 దుకాణాలను, అల్లిపురం రోడ్డులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వరకు ఆరు ఆక్రమణలను ఏసీపీ ఝాన్సీ ఆధ్వర్యంలో తొలగించారు. జోన్-5 పరిధిలో ఊర్వశి జంక్షన్ వద్ద 36 ఆక్రమణలను, ఇంకా సింహాచలం, వేపగుంట జంక్షన్, గాజువాక మెయిన్‌రోడ్డు, వంటిల్లు జంక్షన్, కణితి రోడ్డు, సుంకరమెట్ట, నెహ్రూ చౌక్ వంటి ప్రాంతాల్లో కూడా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఆక్రమణల తొలగింపుతో సీతమ్మధార మెయిన్‌రోడ్డు, ఎస్ఆర్ఐ ఆస్పత్రి రోడ్డు, పెదగదిలి బీఆర్‌టీఆర్ రోడ్డు, తదితర రహదారులు విశాలంగా మారాయి. ఆయా రోడ్లపై వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతోపాటు పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది.

గ్రేటర్ విస్తరణపై అధ్యయనం

అధికారులతో కమిటీ

- రూ.60 కోట్లతో నగరంలో రహదారుల అభివృద్ధి
- పరిశ్రమల కోసం జిల్లాలో ఐదు వేల ఎకరాల గుర్తింపు
- రూ.540 కోట్లతో మధురవాడలో మురుగునీరు శుద్ధి ప్లాంటు... త్వరలో టెండర్లు



- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధి విస్తరణపై అధికారులతో కమిటీ ఏర్పాటువేసి అధ్యయనం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. మూడు రోజుల క్రితం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఎమ్మెల్యేలు కొందరు గ్రామీణ ప్రాంతాన్ని జీవీఎంసీలో విలీనం చేయాలని కోరారన్నారు. అదే సమయంలో నగరంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అభివృద్ధిపై సీఎం పలు సూచనలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తరపున చేపట్టనున్న పనులను శనివారం తన ఛాంబర్‌లో విలేకరులకు వివరించారు.

విశాఖ జిల్లాలో 89 శాతం పట్టణ, 11 శాతం గ్రామీణ ప్రాంతంగా ఉందని, గ్రామీణ మండలాల్లో సుమారు నాలుగు నుంచి ఐదు లక్షల జనాభా ఉంటు న్నట్టు కలెక్టర్ చెప్పారు. నాలుగు గ్రామీణ మండలాల పరిధిలో 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయని పేర్కొంటూ..వాటిని నగరంలో విలీనం చేస్తే కలిగే ప్రయోజనాలు, తలెత్తే ఇబ్బందులు ఏమిటనే దానిపై దృష్టిసారించామన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద ఏటా 16 లక్షల పని దినాలు కల్పిస్తున్నామని, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 30 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఇంకా పద్మనాభం నగరానికి దూరంగా ఉందంటూ జీవీఎంసీ పరిధి విస్తరణపై అధ్యయనం కోసం కమిటీ వేస్తామన్నారు. విశాఖకు వచ్చే కంపెనీల కోసం ఐదు వేల ఎకరాలను గుర్తించనున్నామని అన్నారు. ఈ ఏడాది నవంబరులో పెట్టుబడుల సదస్సు, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్ నిర్వహించనున్న నేపథ్యంలో నగరంలో 26 ప్రధాన రహదారుల అభివృద్ధికి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధుల నుంచి రూ.60 కోట్లు ఖర్చు చేయనున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఇంకా సుందరీకరణ, కూడళ్ల విస్తరణ, అభివృద్ధి, లైటింగ్, ప్రధానంగా గుంతలు లేకుండా రోడ్లు మరమ్మతు చేయాలని, రోడ్లపై దుమ్ము లేకుండా నిరంతరం శుభ్రం చేయాలని సీఎం ఆదేశించారన్నారు. నగరంలోని పార్కుల్లో లైటింగ్, నిర్వహణ, వచ్చే సందర్శకులకు వసతులు వంటివి మెరుగ్గా ఉండాలే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరం నుంచి మురుగునీరు సముద్రంలోకి వెళ్లకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీనిలో భాగంగా మధురవాడ ప్రాంతంలో రూ.540 కోట్లతో యూజీడీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మించబోతున్నామని, త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత శుద్ధిచేసిన నీటిని సముద్రంలోకి విడిచిపెట్టడం లేదా కంపెనీల అవసరాల కోసం విక్రయించడం చేస్తామన్నారు. ఇప్పటికే జీవీఎంసీ శుద్ధిచేసిన మురుగునీటిని హెచ్‌పీసీఎల్‌కు విక్రయిస్తోందని వివరించారు. సీఎం ఆదేశాల మేరకు నగరంలో అన్ని రకాల వసతులు మెరుగుపరచేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు కలెక్టర్ చెప్పారు.

జ్ఞాపకాలను తుడిచేసే అల్జీమర్స్ ▸ నేడు వరల్డ్ అల్జీమర్స్ డే -8లో

140 కోట్ల మందికి జీఎస్‌టీ లబ్ధి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్. చిత్రంలో జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఉన్నారు.

రామ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలు కానున్న కొత్త జీఎస్‌టీ విధానం వల్ల 140 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం రామ్‌నగర్‌లోని హోటల్ రాకోడేల్‌లో నెక్స్ట్ జనరేషన్ జీఎస్‌టీ సంస్కరణలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సరళీకృత పన్ను విధానాన్ని కేంద్రం అమలు చేస్తుందన్నారు. ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యం వైపు ... మిగతా 6వ పేజీలో

ప్రశంసే ఆమెకు పెద్ద బహుమతి

బంధాన్ని బలపరిచే అద్భుత టానిక్

- ఆమె శ్రమను గుర్తించండి
- భార్య యోగ క్షేమాలు తెలుసుకోవడం భర్త కనీస బాధ్యత
- అన్ని విషయాల్లో ఆమెకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు అలుపెరుగకుండా శ్రమించేది ఇంటి ఇల్లాలు. ఓ కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉందంటే అది ఆమె ఘనతే. తన గురించి ఆలోచించుకోకుండా కుటుంబ సభ్యుల కోసం కష్టపడే గొప్ప మనసు ఆమెది. ఓ తియ్యని, ఆప్యాయమైన ప్రశంస ఆమె పడిన కష్టాన్నంతా మరిచిపోయేలా చేస్తుంది. సంసార జీవితంలో భార్యను ప్రశంసించే భర్త వుంటే ఆ బంధం కలకాలం దృఢంగా నిలుస్తుంది. సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. ఇంటి చాకిరీ మొత్తం చేసే భార్యను రెండు పదాలతో సంతృప్తి పరచగలమంటే నమ్మగలరా?, ఆ రెండు పదాలతో ఆమె పడ్డ కష్టం అంతా ఆవిరైపోతుందంటే... విశ్వసించగలరా? నమ్మినా నమ్మకపోయినా ఇది సత్యం. సగటు

ఇంట్లో ఉన్నా ఎక్కువ కష్టపడేది భార్య

ఉద్యోగం చేసే పురుషులు రోజుకు 8 నుంచి 10 గంటలు కష్టపడతారు. ఇంట్లో ఉన్న భార్య కనీసం 15 గంటలు కష్టపడుతుంది. ఆ స్థాయిలో పనిచేస్తేగానీ అన్ని పనులు చక్కబెట్టే వీలుండదు. ఉదయం ఇల్లు తుడవడం మొదలు, పిల్లల్ని స్కూళ్లకు సిద్ధం చేయడం, వంట, వార్పు, భర్త ఆఫీసు సమయానికి తగిన ఏర్పాట్లు...ఇలా లేచిన దగ్గర నుంచి ఉరుకులు, పరుగులే. మళ్లీ సాయంత్రం అదే తంతు. పిల్లల చదువు, హోంవర్క్. వంట పూర్తిచేసి రాత్రి పడుకునేసరికి రాత్రి 11 గంటలు దాటుతుంది. ఇక, ఉద్యోగం చేసేవారైతే చెప్పాల్సిన అవసరం లేదు. అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు ఇంటి నిర్వహణతో రెండు పడవలపై ప్రయాణించక తప్పని పరిస్థితి. అంతగా కష్టపడే ఆమె తన శ్రమకు తగిన ప్రతిఫలంగా ప్రశంస కోరుకునేందుకు నూటికి నూరు శాతం అర్హురాలు.

భార్యను సంతోషపెట్టాలంటే ప్రేమతో కూడిన ప్రశంస చాలు. ఇల్లు ఊడ్చడం మొదలు.. వంట, గిన్నెలు తోముకోవడం, దుస్తులు ఉతకడం.. ఒక్కటేంటి...అన్ని పనులు ఉరుకులు పరుగుల మీద ఆమె చేసుకోవాల్సిందే. పిల్లలు ఉంటే మరింత పని ఒత్తిడి. కానీ అంతటి శ్రమను ఒక్క ప్రశంసతో మటుమాయం చేసుకునేతత్వాన్ని భగవంతుడు ఆమెకే ఇచ్చాడు. కానీ ఏడాదంతా భార్య శ్రమను చూసీ చూడనట్టు వదిలేస్తున్న భర్తలే సమాజంలో అధికంగా ఉన్నారు. అందుకే కనీసం ఏడాదిలో ఒక్కసారైనా ... మిగతా 6వ పేజీలో

17 మంది శానిటరీ సెక్రటరీలకు మెమోలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలను జోనల్ కమిషనర్లు ఆచరణలో పెడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే క్లాప్ వాహనాల పనితీరును పర్యవేక్షించే బాధ్యతను వార్డు శానిటరీ కార్యదర్శులకు అప్పగించాల్సిందిగా జోనల్ కమిషనర్‌లను కమిషనర్ ఆదేశించారు. ఇందుకోసం కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల్లోపు విధులకు హాజరుకావాలి. ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్‌లో హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. ఆరుగంటల్లోపు విధులకు హాజరుకాని వారిపై చర్యలకు జోనల్ కమిషనర్లు ఉపక్రమిస్తున్నారు. జోన్-6 పరిధిలో శనివారం ఉదయం ఆరు గంటల సమయానికి విధులకు హాజరుకాని 17 మంది కార్యదర్శులకు జోనల్ కమిషనర్ శేషాద్రి షోకాజ్ జారీచేశారు. విధులకు హాజరవ్వడంలో నిర్లక్ష్యం వహించినందున, మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలంటూ నోటీసులో పేర్కొన్నారు. అయితే కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని జిల్లా వార్డు, గ్రామ సచివాలయ కార్యదర్శుల సంఘం నేత బండారు శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

24 లేదా 25న విజయవాడలో డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల 24 లేదా 25వ తేదీన విజయవాడలో నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నుంచి శనివారం జిల్లా విద్యా శాఖకు సమాచారం వచ్చింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న అమరావతిలో నియామక పత్రాలు అందజేయాల్సి ఉంది. అయితే అమరావతిలో వర్షాల కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈనెల 24 లేదా 25న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను విజయవాడ తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేయాలని ఉన్నధికారులు ఆదేశించారు. ఇందుకోసం సుమారు 300 మందికిపైగా టీచర్లు అవసరం. అయితే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 80మంది టీచర్లను పంపించాలని ఆయా జిల్లాల డీఈవోలకు విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ లేఖ రాశారు. అభ్యర్థులను విజయవాడకు పంపేందుకుగాను విశాఖ విమల విద్యాలయంలో రిజిస్ట్రేషన్, తదితర విధులు నిర్వహించే టీచర్ల వివరాలను ఆదివారం సాయంత్రంలోగా పంపాలని లేఖలో పేర్కొన్నారు.

వైద్య సేవల్లోనూ కోత!

పెదగంట్యాడ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే వైద్యం

- రాత్రిపూట క్లోజ్
- సోమవారం నుంచి అమలు
- స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నిర్ణయం
- ఉద్యోగులు, కార్మికుల ఆందోళన



పెదగంట్యాడలోని హెల్త్ సెంటర్

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఉద్యోగులు, కార్మికులకు కొన్ని దశాబ్దాలుగా కల్పిస్తున్న సౌకర్యాలను స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఒక్కొక్కటిగా తగ్గించుకుంటూవస్తోంది. గతంలో క్వార్టర్స్‌లో ఉండే వారికి ఉచిత విద్యుత్ ఇచ్చేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కంటే ఎక్కువ ధర...యూనిట్‌కు ఎనిమిది రూపాయలు చొప్పున వసూలుచేస్తున్నారు. ఇంటి అద్దె అలవెన్స్ తీసేశారు. కాంట్రాక్టు వర్కర్లకు నెలకు రూ.2 వేలు చొప్పున ప్రత్యేక అలవెన్స్ ఇచ్చేవారు. అది రద్దు చేశారు. విశాఖ విమల విద్యాలయం మూసేశారు. కేంద్రీయ విద్యాలయంలో ప్లస్ వన్ ప్రవేశాలు నిలిపివేశారు. స్టీల్ జనరల్ ఆస్పత్రి నుంచి రిఫరల్ కేసులు ఆపేశారు. ఇప్పుడు తాజాగా పెదగంట్యాడలోని హెల్త్ సెంటర్ సేవలు కుదించేశారు. ఆ పరిసర ... మిగతా 6వ పేజీలో

చెలరేగుతున్న చైన్‌స్నాచర్లు

ఒకేరోజు వేర్వేరుచోట్ల ముగ్గురు మహిళల మెడలోని ఆభరణాలను లాక్కుపోయిన దుండగులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో చైన్‌స్నాచింగ్‌లు మళ్లీ పెరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. చాలాకాలం తర్వాత అదీ ఒకేరోజు మూడుచోట్ల స్నాచింగ్‌లు జరగడం నగరవాసులతోపాటు పోలీసులను సైతం ఆందోళనకు గురిచేసింది. ఘటన జరిగిన చోట సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా ఇతర రాష్ట్రాలకు చెందినవారు నేరాలకు పాల్పడినట్టు గుర్తించి వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించారు.



నగరంలో చైన్‌స్నాచర్లు చెలరేగిపోతున్నారు. రెండేళ్ల క్రితం పోలీసులకు చైన్‌స్నాచర్లు కంటి మీద కునుకు లేకుండా చేశారు. అయితే ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలతో చైన్ స్నాచింగ్‌లు తగ్గాయి. కొంతకాలం నుంచి పెద్దగా కేసులు నమోదు

అంతర్‌రాష్ట్ర ముఠాగా పోలీసుల అనుమానం

ప్రత్యేక బృందాలతో గాలింపు

కావడం లేదు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఇటీవల కాలంలో మళ్లీ చైన్‌స్నాచర్లు విజృంభిస్తున్నారు. ఈనెల 18వ తేదీన జాతీయ రహదారి పక్కన షీలానగర్ జంక్షన్‌లో ఉన్న డీమార్ట్‌లో సరకులు కొనుగోలు చేసుకుని ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న మహిళను ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు అనుసరించారు. జాతీయ రహదారి దిగిన వెంటనే ఆమె మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడుని తెంచుకుని పరారైపోయారు. ఆ తరువాత కొద్దిసేపటికే అక్కిరెడ్డిపాలెం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి నుంచి జాతీయ రహదారి వైపు నడుచుకుంటూ ... మిగతా 6వ పేజీలో

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొమ్మాది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 9, 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశపరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నవోదయ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా క్రిష్ణమయ్య జయంత్యుత్సవం

సింహాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో కాంతా క్రిష్ణమాచార్యులు జయంత్యుత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ వైదికులు క్రిష్ణమాచార్యుల విగ్రహం వద్ద షోడశోపచారాలు సమర్పించి, పూజలు చేశారు. అనంతరం ఆయన రచించి గానం చేసిన కొన్ని వచన సంకీర్తనలను ఆలయ వైదికులు ఆలపించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్వాసిత కాలనీలో చోరీ

సింహాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు సింహగిరి నిర్వాసిత కాలనీలో శనివారం చోరీ జరిగింది. ఇంటి యజమాని కోరుకొండ నరసింహమూర్తి గోపాలపట్నం పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహమూర్తి దంపతులు సొంత పని మీద రెండు రోజుల క్రితం వేరే ఊరు వెళ్లారు. శనివారం ఉదయం ఊరు నుంచి వచ్చి ఇంటిని శుభ్రపరచే క్రమంలో బీరువా తాళాలు కింద పడి ఉన్నాయి. బీరువా పరిశీలించగా సీక్రెట్ లాకర్‌లో ఉంచిన మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసుకు ఫిర్యాదు చేశారు.

రుషికొండలో తీరం పరిశుభ్రత దినోత్సవం



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న ఏపీపీసీబీ అధికారులు, సిబ్బంది

సాగర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులు తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ ముకుందరావు కోరారు. అంతర్జాతీయ తీరం పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని శనివారం రుషికొండ బీచ్‌లో ఆ శాఖ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పర్యావరణం సమతుల్యంగా ఉండడంతో పాటు సముద్ర జలాలు కాలుష్యం బారిన పడకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ విశ్వకర్మ నుంచి లెఫ్టినెంట్ కమాండర్ హృదయ్‌కిరణ్, జిల్లా టూరిజం అధికారిణి మాధవి, బిస్లేరి సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ బాల సైదాబాబు, ఇం డియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధులు శరత్‌చంద్ర, బోనం ప్రసాద్, శ్రీనాథ్, సన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, పాల్గొన్నారు.

140 కోట్ల మందికి జీఎస్టీ లబ్ధి

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నదని, అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్థిక సంస్కరణలతో మనదేశం మాత్రం అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందన్నారు. అన్ని రంగాల్లో అత్యున్నత ప్రతిభ చూపుతూ ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామన్నారు. జీఎస్టీ స్లాబుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు సురేంద్రమోహన్, నాగేంద్ర, సుహాసిని ఆనంద్, ఉమ్మడి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న చైన్‌స్నాచర్లు

... 5వ పేజీ తరువాయి

వస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును తెంచుకుపోయారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి సీ హార్స్ జంక్షన్‌లో నడుచుకుంటూ టౌన్‌కొత్తరోడ్డువైపు వెళుతున్న మహిళ మెడలోని తులం చైన్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు తెంచుకుని పరారైపోయారు. చైన్‌స్నాచర్లు బలంగా ఆమె మెడలోని చైన్‌ను లాగడంతో అదుపుతప్పిన ఆమె తూలికిందపడిపోయింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఒకేరోజు గంటల వ్యవధిలో మూడుచోట్ల చైన్‌స్నాచింగ్‌లు జరగడంతో సీపీ శంఖబ్రతబాగ్చి సీరియస్‌గా తీసుకున్నారు. నేరం జరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా చైన్‌స్నాచర్లు వినియోగించిన వాహనాలు, వారి ఫొటోలు, వీడియోలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. నేరానికి పాల్పడినవారు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. వారి కోసం ప్రత్యేక బృందాలతో వివిధ రాష్ట్రాలకు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.



గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది



తగరపువలసలో అధికారులతో సీఐటీయూ నాయకుల వాగ్వాదం

కొనసాగిన దుకాణాల తొలగింపు

- మధురవాడ, తగరపువలసలో వందలాది బడ్డీలు తరలింపు
- సీఐటీయూ ఆందోళన

మధురవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీ వంద అడుగుల రహదారిలో ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది. జీవీఎంసీ అధికారులు కాలనీ రహదారిలో ఉన్న ఆక్రమణలను రెండు రోజులుగా తొలగిస్తున్నారు. శనివారం ఉదయం కూడా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణదారుల్లో కొందరు తొలగించిన కంటైనర్లు, బడ్డీలను వేరే ప్రాంతానికి స్వచ్ఛందంగా తీసుకువెళ్లగా, మరికొందరు అక్కడే విడిచిపెట్టారు. వాటిని జీవీఎంసీ సిబ్బంది వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించారు. గాంధీ బొమ్మ సెంటరులో కొందరు కాలువలపై శ్లాబు వేసి దుకాణాలకు దారి ఏర్పాటు చేసుకున్నారు. వాటిని కూడా అధికారులు తొలగించారు. కాగా ఆక్రమణల తొలగింపు వల్ల దసరా వ్యాపారాలు పోయాయని చిరు వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే అక్కడ తమ వ్యాపారాలు కొనసాగిస్తామని చెబుతున్నారు. ఈమేరకు వారు జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్ర అందించారు.

47 బడ్డీల తొలగింపు

తగరపువలస : స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీని ఆనుకుని ఆనందపురం వైపు ఉన్న 47 బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ డీసీపీ కె. వెంకటేశ్వరరావు, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో భీమిలి జోన్ ఏసీపీ రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, సిబ్బంది పోలీసుల సహకారంతో బడ్డీల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అప్పలనాయుడు, వైసీపీ నాయకులు ఎస్. కరుణాకర్ రెడ్డి, అక్కరమాని మంగరాజు మాట్లాడుతూ బడ్డీల తొలగింపు వల్ల చిరువ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. 30 ఏళ్లుగా ఆస్పత్రి ప్రహరీని ఆనుకుని పేదలు బడ్డీలు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. అకస్మాత్తుగా బడ్డీలను తొలగిస్తే ఆయా కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారుల తీరు వల్ల 60 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రాము, నరసింగరావు, కనకరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, చిరు వ్యాపారులు

కొమ్మాది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణల తొలగింపు వల్ల ఉపాధి కోల్పోయిన తోపుడు బండ్లు, చిరు వ్యాపారులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు సీఐటీయూ ఆధ్వర్యంలో మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డు నుంచి కార్ షెడ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్‌లో మానవహారం చేపట్టేందుకు ప్రయత్నించగా పీఎంపాలెం పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, డి. అప్పలరాజును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో తోపుడు బండ్ల కార్మికులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమ గోడు అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని, కనీసం ప్రజలకైనా తెలియనివ్వరా అని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు.

వైద్య సేవల్లోనూ కోత!

... 5వ పేజీ తరువాయి

ప్రాంత ప్రజలు, ఉద్యోగులకు ఉపయోగపడేలా దీనిని నలుగురు వైద్యులతో చాలాకాలంగా నడుపుతున్నారు. ముగ్గురు వైద్యులు పగటిపూట, రాత్రివేళ ఇంకో డాక్టర్ ఉండేవారు. వీరికి సాయంగా నర్సులు, కాంపౌండర్, పారిశుధ్యం సిబ్బంది ఉండేవారు. నాలుగు రోజుల క్రితం యాజమాన్యం ఒక నోటీసు జారీచేసింది. ఈ నెల 22వ తేదీ నుంచి అంటే సోమవారం నుంచి కేవలం జనరల్ షిఫ్ట్‌లోనే ఈ హెల్త్ సెంటర్ పనిచేస్తుందని ప్రకటించింది. అంటే ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెరిచి ఉంచుతారు. ఆ తరువాత మూసేస్తారు. రాత్రిపూట వైద్యం అందదు. ప్రస్తుతం ఈ కేంద్రానికి ఒకే ఒక వైద్యుడు ఉన్నారు. ఆయనతోనే నడుపుతున్నారు. ఇంతకుముందు రోజుకు 150 నుంచి 200 మంది ఇక్కడికి వైద్యం కోసం వచ్చేవారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో రోగులు కూడా తగ్గిపోయారు. ప్రస్తుతం జ్వరానికి మందులు తప్ప ఇంకేమీ ఇవ్వడం లేదు. గాయాలతో వచ్చిన వారిని కూడా ప్రధాన ఆస్పత్రికి పంపించేస్తున్నారు. క్రమంగా దీనిని మూసేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. దీనిపై పెదగంట్యాడ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఎప్పటిలాగే రాత్రిపూట కూడా నడపాలని కోరుతున్నారు.

110 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఆనందపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకార సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం వెల్లంకి గ్రామంలో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుబ్బిరామరెడ్డి కల్యాణ మండపంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 110 మంది రోగులకు పరీక్షించి, 20 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు.

లాభాల బాటలో మధురవాడ పీఏసీఎస్



మహాజన సభలో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు, తదితరులు

మధురవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) గత ఆర్థిక సంవత్సరంలో రూ. 38 లక్షలు లాభాలు ఆర్జించినట్టు పీఏసీఎస్ చైర్మన్ పోతిన ప్రసాద్ తెలిపారు. శనివారం సొసైటీ ఆవరణలో ఆ సంఘం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘంలో 3083 మంది సభ్యులున్నారని, సభ్యుల షేరు ధనం రూ.8.24 లక్షలు ఉండగా రూ.4.28 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం సొసైటీ స్థలం కొంత వరకు తీసుకుంటారని, ఆ నష్టపరిహారం కూడా సొసైటీకి వస్తుందన్నారు. అనంతరం సొసైటీ భవనానికి మరమ్మతులు చేయించాలని చైర్మన్ ప్రతిపాదించగా సభ్యులు అంగీకారం తెలిపారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో గత ఏడాది ప్రారంభించిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ మందుల షాపు వల్ల రూ.4.87 లక్షలు నష్టం రావడంతో దుకాణం మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు పోతిన మీనాక్షి, బైపిల్లి పైడిరాజు, మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు, మాజీ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, సియ్యాద్రి పైడితల్లి, డీసీసీబీ మధురవాడ శాఖ మేనేజర్ జి. వెంకటఅప్పారావు, ఎడ్యుకేషన్ అధికారి రమేశ్‌బాబు, సీఈఓ అప్పలరాజు పాల్గొన్నారు.

రేవిడిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

పద్మనాభం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రేవిడి పీహెచ్‌సీని ప్రపంచ బ్యాంకు బృందం శనివారం సందర్శించింది. డాక్టర్ వర్ష, డాక్టర్ భార్గవి, డాక్టర్ చరిత బృందం ఆస్పత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ పరిశీలించి ఏయే వ్యాధుల కేసులు ఎక్కువగా వస్తున్నాయో వైద్యాధికారి లీలాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు



సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునని, చాలామంది రోగులు ఈ విషయాన్ని నిరూపించారని ఐఎఫ్ఎస్ ఎ. నీరజ అన్నారు. క్యాన్సర్ క్యూర్ ట్రస్ట్, సంకల్ప్ ట్రస్ట్, మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన 2వ క్యాన్సర్ క్యూర్ వార్షిక అంకాలజీ సదస్సు శనివారం రాత్రి బీచ్‌రోడ్డులో ఉన్న రాడిసన్ బ్లూలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, జీవన శైలి ద్వారా క్యాన్సర్‌ను దరిచేరనీయకుండా చేయవచ్చునన్నారు. చికిత్సలో అధునాతన వైద్యం అందుతోందని, రోగులు మానసికంగా దృఢంగా ఉంటే ఏమీ కాదని చెప్పారు. డీఆర్‌డీఓ చైర్మన్ జి. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని, త్వరలోనే పరిశోధనలు ఫలాలు రోగులకు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. జీవీపీ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ అంకాలజిస్టులు, పరిశోధకులు ఎప్పటికప్పుడు వైద్యంలో వస్తున్న మార్పులను గమనించి, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రముఖ నిపుణులు డాక్టర్ రఘునాథ్, డాక్టర్ సుమన్ చక్రవర్తి కూడా మాట్లాడారు. అనంతరం సమాజంలో క్యాన్సర్ నివారణకు కృషి చేస్తున్న వ్యక్తులను, సంస్థలను నిర్వాహకులు సత్కరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశీయ, అంతర్జాతీయ అంకాలజిస్టులు, శస్త్ర చికిత్స నిపుణులు, రేడియాలజిస్టులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే సంస్థకు పేరు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



అధికారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

సాగర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉద్యోగులకు సూచించారు. ఏపీఈపీడీసీఎల్ సాగర్‌నగర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఐఐఎం విశాఖపట్నం సహకారంతో సంస్థ ఉద్యోగులకు మూడు రోజుల పాటు ఆర్గనైజేషనల్ బిహేవియర్ మేనేజింగ్ పీపుల్ అన్న అంశంపై నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన వారికి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పద్మనాభం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సర్వైకల్ క్యాన్సర్ విముక్త భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారని హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నేషనల్ ఫ్యాకల్టీ, ట్రైనర్ డాక్టర్ అల్లు నీహారిక చెప్పారు. శనివారం పద్మనాభంలోని కేజీబీవీలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం ఏపీ కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు టి. నాగమణి, విద్యాలయం ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, ఉపాధ్యాయులు రమణమ్మ, మునివర్ధనం, బీజేపీ నాయకులు సోమేశ్, కృష్ణారావు, వెంకటరావు, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాందేవుపురంలో వైద్య శిబిరం

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య రక్షణ కోసమే ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సాగి కృష్ణమూర్తిరాజు అన్నారు. శనివారం బాందేవుపురం గ్రామంలో జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైడినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు బోని సత్యవతి. సన్యాసినాయుడు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తాం

- నష్టపరిహారం పెంపు విజ్ఞప్తిని సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్‌డేటా సెంటర్‌కు భూములిచ్చే రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ అభిమతమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన సర్క్యూట్ హౌస్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన తర్లువాడ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు అందరూ సహకరించాలన్నారు. భూములిచ్చేందుకు రైతులు సానుకూలంగా ఉన్నారని పేర్కొంటూ కొందరు రైతులు లేవనెత్తిన అంశాలు పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సబ్ రిజిస్ట్రార్ విలువ రూ. 17 లక్షలు ఉందని, డీపట్టా భూములకు రెండున్నరెట్లు పరిహారం ఇస్తున్నామని అన్నారు. దీనిపై రైతులు జోక్యం చేసుకుని పరిహారం విలువ పెంచాలని కోరగా గంటా స్పందిస్తూ సోమవారం నగరానికి రానున్న సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీలకు ఇచ్చిన డీపట్టా భూములకు పరిహారం ఇవ్వడంతో పాటు సమీపంలో కొంత భూమి ఇచ్చే అవకాశం లేదని స్పష్టంచేశారు. గూగుల్ సెంటర్‌లో భూములిచ్చిన రైతుల కుటుంబాలకు ఉపాధి, ప్రభుత్వం ఇచ్చే మూడు సెంట్ల స్థలాలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుపై బాధ్యత తీసుకుంటామన్నారు. ఆక్రమణదారులకు ఎకరాకి రిజిస్టర్ విలువలో సగం మాత్రమే పరిహారంగా ప్రకటించారని చెప్పారు. గ్రామంలోని 520 మంది రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఆనందపురం తహశీల్దారు శ్రీనుబాబు, తర్లువాడ సర్పంచ్ నాయుడు, మాజీ సర్పంచులు మజ్జి వెంకటరావు, బాలి అయ్యప్ప, ఇంకా తాత్రాజు అప్పారావు, బంకు రాజు, ఆదినారాయణ, రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టపరిచేందుకు అనేక సంస్కరణలు చేపడుతున్నదని ఎమ్మెల్యే గంటా అన్నారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దివీస్ కంపెనీ వితరణగా ఇచ్చిన సైన్స్ కిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వినతిమేరకు పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ జీఎం కోటేశ్వరరావు, డిప్యూటీ జీఎం జగదీశ్, సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, ఎంపీడీఓ జానకి, తహశీల్దార్ శ్రీనుబాబు, చిక్కాల విజయ్‌బాబు, బీఆర్‌బీ నాయడు, గాడు వెంకటప్పడు, కోరాడ రమణ పాల్గొన్నారు.

అన్నవరం రోడ్డు పునర్నిర్మాణానికి శంకుస్థాపన

భీమునిపట్నం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :అవంతి ఇంజనీరింగ్ కళాశాల నుంచి గుడివాడ, చిప్పాడ మీదుగా అన్నవరం వెళ్లే రహదారి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం అవంతి కళాశాల జంక్షన్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ అందించిన రూ.6.18 కోట్లతో ఈ పనులు జరుగుతాయన్నారు.

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రత, శుభ్రతతో పాటు పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన విశాఖ నగర విశిష్టత, ప్రాముఖ్యత మరింత పెంచేలా ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కార్యదర్శి కాటంనేని భాస్కర్ సూచించారు. ఈనెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న ఈ-గవర్నెన్స్ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రంగాల నిపుణులు, అతిథులు వస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర ఐటీ మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు సదస్సులో భాగస్వామ్యులవుతారని, అందువల్ల పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజులపాటు జరిగే సదస్సుకు వెయ్యి మంది అతిథులు హాజరుకానున్నారన్నారు. సదస్సు జరిగే చోట రిజిస్ట్రేషన్లు కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాట్లుచేయాలని, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ వద్ద హోర్డింగ్‌లు పెట్టాలన్నారు. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు అనుగుణంగా నియమించిన కమిటీలు, ఇప్పటివరకూ చేపట్టిన పనులను వివరించారు. సమీక్షలో జేసీ కె.మయూర్ అశోక్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ సూర్యతేజ, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, డీఆర్వో భవానీశంకర్, పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్

సింహాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కలెక్టర్ గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు.

ప్రశంసే ఆమెకు పెద్ద బహుమతి

... 5వ పేజీ తరువాయి

వాళ్లను ప్రశంసించేలా 'వైఫ్ అప్రిషియేషన్ డే'ను ఏటా సెప్టెంబర్ మూడో ఆదివారం నిర్వహిస్తున్నారు. దీని వెనుక కచ్చితమైన చరిత్ర లేకపోయినా..ఇటీవల కాలంలో ఈ రోజుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

పైకి చెప్పరు...

మహిళలతో పోలిస్తే..పురుషుల్లో భావవ్యక్తీకరణ చాలా తక్కువ. భార్యపై ఎంత ప్రేమ ఉన్నా..బయటకు చెప్పే నేర్పు చాలామంది పురుషుల్లో లోపిస్తోంది. ఆమె పడ్డ శ్రమను లోలోనే అభినందిస్తారు తప్ప..ఆమెతో నేరుగా చెప్పరు. అదే భార్యలో అసంతృప్తికి కారణమవుతోంది. 'కోడి కూసిన దగ్గర నుంచి గొడ్డులా కష్టపడినా...ఈ కొంపలో గుర్తింపు ఉండదు' అనే బాధ చాలా మందిలో కనిపిస్తుంది. మనకోసం అనుక్షణం కష్టపడే ఆమెను ప్రశంసించడం నేరం కాదన్న విషయాన్ని గుర్తించాలి. ఆమె శ్రమను గుర్తించాలి. ఆమె చేసే మంచి పనిని గుర్తించి ప్రశంసించాలి. మనసులో గంపెడు ప్రేమ ఉన్నా..వ్యక్తీకరించకుంటే నిష్ఫలమే. అందుకే ఆమెపై ఉన్న ప్రేమాభిమానాలను ఎప్పటికప్పుడు వ్యక్తీకరించాలి.

భార్యకు ప్రాధాన్యం ఇవ్వండి

భార్యకు అన్ని విషయాల్లో ప్రాముఖ్యం ఇస్తే ఆమె సంబరపడుతుంది. కుటుంబ విషయాలన్నీ ఆమెతో పంచుకుని ఆమె సలహాలు తీసుకోవడం వల్ల మరింత సంతోషంగా ఉంటుంది. అలాగే ఎంత బిజీగా ఉన్నా వారానికి ఒక్క రోజైనా.. కుటుంబంతో కలిసి గడిపేందుకు ప్రయత్నించండి. రోజులో ఎంత బిజీగా ఉన్నా..కొంత సమయాన్ని ఆమెతో మాట్లాడేందుకు కేటాయించండి. అలాగే ఆమెతో ఉన్న జ్ఞాపకాలను ఎప్పటికప్పుడు గుర్తుచేసుకోండి. ప్రత్యేక దినాల్లో ఆమెను డిన్నర్‌కు తీసుకువెళ్లే ప్రయత్నం చేయండి.

పనిలో సాయపడాలి

ఆమెకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే..మీరు ఓ చేయి వేయండి. పనిలో ఆమెకు సహకరించండి. ఆమెకు మీరు చేసే చిన్నపని వల్ల శారీరకంగా శ్రమ తగ్గకపోయినా.. మానసికంగా కలిగే ఆనందం వెల కట్టలేం.

గౌరవించండి

ఆమెకు గౌరవాన్ని ఇవ్వండి. ఆమె మాటకు విలువ ఇవ్వండి. పది మందిలో ఆమెను చులకన చేయకండి. వీలైతే పది మందిలో ఆమె గొప్పతనాన్ని షేర్ చేసుకోండి. విమర్శలు అందరి మధ్యా చేయకండి. ఏదైనా లోపం ఉంటే ఆమెకు ఒంటరిగా చెప్పండి. అదే ఆమెకు ఇచ్చే గౌరవం అని గుర్తుంచుకోండి.

ఇగ్నో కోర్సుల అడ్మిషన్ల గడువు 30 వరకూ పొడిగింపు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025 విద్యా సంవత్సరానికి దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 30 వరకూ పొడిగించినట్టు సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆరు నెలల కాలవ్యవధి ఉన్న సర్టిఫికెట్, సెమిస్టర్ కోర్సులుమినహా విశ్వవిద్యాలయం అందిస్తోన్న అన్ని డిప్లొమా, పీజీ డిప్లొమో,డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెప్టెంబరు 30 వరకూ అడ్మిషన్ల గడువు పెంచారు. ఫీజులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సుల్లో ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల కోసం యాభై శాతం ఫీజు రాయితీ ఉంటుందని తెలిపింది.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సీతమ్మధార ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎం.సింహాద్రిరాజు, ఛైర్మన్ కొండ్రు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 22న సాయంత్రం ఏడు గంటలకు నాట్య కళారాశి వారి కూచిపూడి నృత్యప్రదర్శనలు, 23న విజయనగరం నందూరి కాశీ ప్రసాద్ బృందం సంగీత విభావరి, 24న కొండ్రు రామారావు, రంగనాథ్, ఎల్.సూర్యనారాయణ శ్రీదేవిలతో అన్నమయ్య కీర్తనలు, 25న సుహాసిని బాల త్రిపుర సుందరి పూజ, 26న చండీయాగం, అదే విధంగా నారాయణీయం, పారాయణం, 27న సాయంత్రం శ్రీవెంకటదుర్గా అన్నమాచార్య సంస్థ చిన్ను కోలాటం, 28న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆర్.నాగరాజ్ పట్నాయక్ దర్శకత్వంలో బహుభాష, నృత్య ప్రదర్శనలు, 29న అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక మహా కుంకుమ పూజలు, 30న సాహితీ రవళి శిష్యులతో కూచిపూడి నృత్య ప్రదర్శన, అక్టోబరు 1న లలిత చంద్రశేఖర్ శిష్యులతో సంగీత విభావరి, 2వ తేదీన దశమీ పూజలు ఉంటాయని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు శుభపరిణామం

- ఏపీపెర్వాస్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆక్రమణల తొలగింపునకు ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య (ఏపీపెర్వాస్) తమ మద్దతును తెలియజేస్తుందని ఏపీపెర్వాస్ అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ తీసుకున్న "ఆపరేషన్ లంగ్ స్పేస్"కు తాము ఎంతో హర్షిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో దాదాపు 1000కు పైగా ఆక్రమణలను తొలగించడం చాలా మంచి పరిణామమని, ఈ చర్యల వలన చాలా వరకు ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు పరిష్కరించబడతాయన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 708, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

సాగరగిరి దుర్గమ్మను చూసొద్దామా..

- రేపటి నుంచి అక్టోబరు 2వ తేదీ (విజయదశమి) వరకు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే అవకాశం
- ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.40



సాగరగిరి కనకదుర్గమ్మ





దుర్గమ్మ ఆలయానికి బోటులో ప్రయాణం (ఫైల్), ఆలయానికి వెళ్లే మెట్ల మార్గం

మహారాణిపేట/మల్కాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగరంలో కొంతదూరం బోటులో ప్రయాణించి యారాడ కొండపై కొలువుదీరిన సాగరదుర్గ అమ్మవారిని దర్శించుకోవడం సందర్శకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. ఇటువంటి మధురానుభూతిని పొందాలంటే విశాఖలోని పాత పోస్టాఫీసు వద్దనున్న పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న జెట్టీ నుంచి బోటులో ప్రయాణించి యారాడ కొండపై ఉన్న సాగరగిరి కనక దుర్గమ్మను దర్శించుకోవాలి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మాత్రమే ఈ అమ్మవారిని బోటులో వెళ్లి దర్శించుకునే అవకాశం ఉంది. సముద్రం ఆవల ఉన్న డాల్ఫిన్ నోస్ (యారాడ) కొండ మీద సాగరదుర్గ అమ్మవారు సంద్రానికి దగ్గరగా కొండపై వెలసి ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా భక్తులతో పూజలందు కుంటున్నారు. చాలాకాలంపాటు విశాఖ వాసులు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునేవారు. అయితే నేవల్, పోర్టు అధికారులు దేశ రక్షణ అవసరాల నిమిత్తం సున్నితమైన ప్రాంతం కావడంతో సాధారణ ప్రజలు బోటులో వెళ్లడాన్ని నిషేధించారు. దీంతో అమ్మవారి దర్శనానికి బోటు ప్రయాణం ఆగిపోయింది. ఒకవేళ సాగరగిరి దుర్గమ్మను దర్శించాలనుకుంటే సింధియా నుంచి బస్సులో వెళ్లవచ్చు. అయితే అది దూరభారంతో కూడుకున్నది. కానీ పాత పోస్టాఫీసు నుంచి సుమారు 10 నిమిషాలపాటు బోటులో ప్రయాణించి, అక్కడ నుంచి నడిచి కొండెక్కి దుర్గమ్మను దర్శించుకోవడం ఎంతో మధురానుభూతిని మిగుల్చుతుంది. సువిశాలమైన సాగర తీరాన్ని కొండపై నుంచి చూస్తే చక్కటి అనుభూతిని అందిస్తుంది. కాగా పోర్టు అధికారులు ఏటా శరన్నవ రాత్రులను పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకునేందుకు బోటు ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే భాగ్యం ప్రజలకు లభిస్తుంది. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోట్ల ద్వారా రాకపోకల సౌకర్యం ఉంటుంది. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.40గా నిర్ణయించారు.

ఆలయంలో 18 శక్తి పీఠాలు

కాగా సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయం చుట్టూ 18 శక్తి పీఠాలు ఉన్నాయి. శ్రీలంక శాంకరిదేవి, తమిళ నాడు కంచి కామాక్షి, పశ్చిమ బెంగాల్ శృంఖలాదేవి, మైసూరు చాముండేశ్వరీదేవి, ఆలంపూర్ (కర్నూలు) జోగులాంబ, శ్రీశైలం భ్రమరాంబికాదేవి, కొల్హాపూర్ మహాలక్ష్మి, మహర్ (మహారాష్ట్ర) ఏకవీరిక, ఉజ్జయిని (మధ్యప్రదేశ్) మహాకాళి, పిఠాపురం పురుహూతిక (ఏపీ), ఓఢ్య (ఒడిశా) గిరిజాదేవి, ద్రాక్షారామం (ఏపీ) మాణిక్యాంబ, హరిక్షేత్ర (గౌహతి) కామరూపా దేవి,ప్రయాగ(అలహాబాద్), జ్వాలా క్షేత్రం (హిమాచలప్రదేశ్) వైష్ణవీదేవి, గయ (బిహార్) మంగళగౌరి, కాశీ విశాలక్ష్మి (ఉత్తర ప్రదేశ్), జమ్ము కశ్మీర్ సరస్వతీదేవి పీఠాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ప్రత్యామ్నాయం చూపకుండా దుకాణాల తొలగింపా?

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు

మద్దిలపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు లేని సమయంలో జీవీఎంసీ అధికారులు నాటకీయంగా దుకాణాలు తొలిగిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా చిరు వర్తకులపై విధ్వంసం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదల పట్ల జీవీఎంసీ అధికారులు కర్కశంగా ప్రవర్తించడాన్ని వైసీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. జీవీఎంసీ అధికారులకు దమ్ము, ధైర్యం ఉన్నట్టయితే అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న అదనపు అంతస్తులు, అనుమతులు లేని కమర్షియల్ భవనాలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలకు మేం వ్యతిరేకమే గాని పేదలకు హ్యాకర్స్ జోన్ ఏర్పాటు లేదా ఇతర ప్రత్యమ్నాయ మార్గం చూపకుండా జీవనాధారం లేకుండా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు మొల్లి అప్పారావు, రవిరెడ్డి పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు ఆపివేయాలి : సీపీఐ

ఆరిలోవ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జీవీఎంసీ అధికారులు, పోలీసులు దుకాణాలను తొలగించడం అన్యాయమని, వెంటనే ఈ ప్రక్రియను నిలిపి వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ డిమాండ్ చేశారు. దుకాణాల తొలగింపును నిరసిస్తూ శనివారం ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ చర్య 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'లా ఉందన్నారు. ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా చిరు వ్యాపారాలు చేసుకొని జీవనోపాధి పొందుతున్న వారిపై ఇలాంటి చర్యలు చేపట్టడం తగదన్నారు. దుకాణాల తొలగింపుకు ఆపకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దేవుడమ్మ, సీహెచ్ కాసుబాబు, ఎ.సందీప్, అన్నపూర్ణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నగర కార్యాలయంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు, పాల్గొన్న ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పి.పరశురామ్‌రాజు తదితరులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీనగర కార్యాలయంలో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల సందర్భంగా శనివారం బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు అధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విచ్చేసి రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ప్రజలు అవగాహనతో విరివిగా రక్తదానాన్ని చేయడం వల్ల అత్యవసర పరిస్థితిలో ఉన్నవారి ప్రాణాలు కాపాడడం కోసం మన వంతు సహాయం చేసినవారమవుతామని అన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో నాయుకులు, కార్యకర్తలు కలిసి 40 యూనిట్స్ బ్లడ్ సేకరించి నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సురేంద్రమోహన్, సుజాత, ఎం.నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేష్, మీడియో ఇన్‌చార్జి కోటేశ్వరరావు, లంక శ్రీరామ్, భారతి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక మార్పులను ఆకళింపు చేసుకోవాలి

- సమాజాభివృద్ధికి అవసరమైన సాంకేతికత అవసరం
- వర్కింగ్ గ్రూప్-111/9 ఐఎస్‌పీఆర్ఎస్ ఛైర్మన్ ఐవీ మురళీ కృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న మురళీకృష్ణ, పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కె.రాంబాబు, ప్రొఫెసర్ శశిభూషణరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఆవిష్కరణలు, అభివృద్ధిని ఆకళింపు చేసుకోవడాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఫొటోగ్రామెట్రీ అండ్ రిమోట్ సెన్సింగ్ (ఐఎస్‌పీఆర్ఎస్) వర్కింగ్ గ్రూప్ 111/9 ఛైర్మన్ ప్రొఫెసర్ ఐవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియో మాటిక్స్ విశాఖ ప్రాంతీయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'జియో స్పెషల్ టెక్నాలజీస్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్'పై ఒక రోజు వర్క్‌షాప్‌ను ఏయూలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఛైర్మన్ ప్రొఫెసర్ ఐవీ మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి అవసరమైన సాంకేతికతలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జియో స్పేషియల్ టెక్నాలజీస్ అనువర్తనాలు అపారమని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్య పెరిగితే మేకింగ్ ఇండియా, మేడిన్ ఇండియా సాకారం అవుతాయని పేర్కొన్నారు. విభిన్న శాస్త్రాలకు సంబంధించి జ్ఞానాన్ని జియో స్పేషియల్ టెక్నాలజీ వినియోగికుంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఏఐ, ఎంఎల్, డీప్ టెక్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాంకేతిక శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, దీనికి అనుగుణంగా అవగాహన పెంచు కోవడం అవసరమన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ జియో స్పేషియల్ రంగంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల విశ్వవిద్యాలయానికి బెస్ట్ యూనివర్శిటీ అవార్డు, ప్రొఫెసర్ వజీర్ మహ్మద్‌కు లభించిన నేషనల్ జియో స్పేషియల్ ఫ్యాకల్టీ అవార్డులే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వజీర్ మహ్మద్ మాట్లాడుతూ జియో స్పేషియల్ టెక్నాలజీలు, వాటి అనువర్తనాలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థుల ప్రేరణ కలిగిస్తూ ఈ రంగంలో వారిలో నూతన ఆసక్తిని పెంపొందించే దిశగా నిపుణుల ప్రసంగాలు ఉంటాయన్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, మ్యాపింగ్ వంటి కార్యక్రమాలు వారిలో అపారమైన అవగాహను పెంపొందించాయన్నారు. జీఐఎస్‌పై కోర్సులు పూర్తి చేయనప్పటికీ ఆసక్తితో, అవగాహన పెంచుకుని ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు సమయ పాలన తప్పనిసరి

- అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధులకు హాజరుకావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆదేశించారు. శనివారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ఎస్‌వర్మతో కలిసి అన్ని జోన్ల కార్యాలయాల పర్యవేక్షకులు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ జీవీఎంసీలో ఉన్నత స్థాయి అధికారుల నుంచి చిరు ఉద్యోగుల వరకూ నిర్ణీత సమయానికే విధుల్లో ఉండాలన్నారు. ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా వారి వారి సీట్లలో కూర్చోవాలని సాయంత్రం 5.30 గంటల వరకూ తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల మధ్య భోజన విరామ సమయం తీసుకోవాలన్నారు. చాలా మంది ఉద్యోగులు 1 గంట నుంచి 3 గంటల వరకు విధులకు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు కేసులు, టపాల్సు, పీజీఆర్ఎస్‌లు, ఈ ఆఫీస్ ఫైల్స్ నోట్, డ్రాఫ్ట్, ప్రియాంబుల్స్ తదితర వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేసి పై అధికారులకు పంపించాలని ఆదేశించారు. ప్రధాన కార్యాలయం నుంచి జోన్ల కార్యాలయానికి టపాల్సు చేరేందుకు సమయం పడుతుందని, అందుకే ముందుగా సౌలభ్యం కోసం వాటిని ఈ మెయిల్స్ ద్వారా జోన్ల కార్యాలయాలకు పంపించాలన్నారు. ఇకపై ప్రతి ఫైల్ ఈ-ఆఫీసులో ద్వారా డిజిటల్ సంతకంతో పంపించాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తమ సీట్లను వదిలి బయటకు వెళ్లవలసి వస్తే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా పని వివరాలు నమోదు చేసి బయటికి వెళ్లాలని అదనపు కమిషనర్ ఉద్యోగులకు స్పష్టం చేశారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రథమ స్థానం పొందిన ఆళ్వార్‌దాస్ కాలేజీ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంటర్ కాలేజియేట్ పురుషుల కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. విజేతలకు ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ బహుమతులను అందజేశారు. కబడ్డీ ఫైనల్స్ సమతా కాలేజీ, ఆళ్వార్‌దాస్ డిగ్రీ కాలేజీకి మధ్య ఏయూ వ్యాయామ విద్యా విభాగం జిమ్నాజియంలో జరిగాయి. 'ఆళ్వార్' జట్టుకు 33 పాయింట్లు, సమతా కళాశాల జట్టుకు 20 పాయింట్లు రావడంతో ఆళ్వార్‌దాస్ కాలేజీ జట్టు విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం సాంకేతిక కళాశాలకు, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు మ్యాచ్ నిర్వహించగా, కృష్ణా కాలేజీ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ప్రొఫెసర్ ఎ.పల్లవి, హాస్టల్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎన్ఎం యుగంధర్, కబడ్డి సెలక్షన్ కమిటీ మెంబర్లు, ఐఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత పరిరక్షణ అందరి బాధ్యత

- ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ అప్ డే కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్



తీరంలో వ్యర్థాలను ఏరివేస్తున్న శ్రీభరత్, తదితరులు

బీచ్‌రోడ్డు, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంత పరిరక్షణలో, పరిశుభ్రంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శనివారం ఆర్కే బీచ్ వద్ద తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ అప్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తీరానికి వచ్చే సందర్శకులు ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను పడేస్తుండడం శోచనీయమని, ఇకపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంతాల పరిశుభ్రత వల్ల సముద్ర జీవరాశులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా అందరూ క్లాత్, పేపర్ బ్యాగులు, గాజు, స్టీల్ పాత్రలను వినియోగించాలని సూచించారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీ, కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు నేవీ ఉద్యోగులు, విద్యార్థులు తీరంలోని చెతాచెదారం, వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమాండర్ రాజేష్ మిట్టల్, అసిస్టెంట్ కమాండెంట్ సార్థక్ కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల భద్రత, వాహనదారుల రక్షణే ధ్యేయంగా

ఆపరేషన్ లంగ్స్- 2.0 కార్యాచరణ

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో అన్ని ఫుట్‌పాత్‌లను కేవలం పాదచారులు, వాహనాలు లేని వారు సురక్షితంగా నడిచేందుకేనని, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు విశాలమైన రోడ్లు, జంక్షన్లలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా, ప్రజల భద్రత, రక్షణ దిశగా జీవీఎంసీ అధిక మొత్తంలో నిధులను వినియోగిస్తూ ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేయడం జరుగుతుందని కమిషనర్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లు, ప్రధాన జంక్షన్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడు బండ్ల కారణంగా ట్రాఫిక్ పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రధానంగా పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి ట్రాఫిక్ అవరోధం కాకూడదనే ఉద్దేశంతో అనధికార దుకాణాలను తొలగిస్తున్నట్టు స్పష్టం చేశారు. అలాగే ఫుడ్ స్టాళ్ల వద్ద ఆహారం తింటూ పలువురు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రజల భద్రత, రక్షణ, ఆరోగ్య పరిరక్షణతో పాటు ఫుట్‌పాత్‌ల స్వేచ్ఛ, విశాలమైన రోడ్లకు ఉపశమనం, పాదచారులు, వాహనాలు లేని వారికి సురక్షిత మార్గాలు, వాహనదారుల రాకపోకలకు రక్షణ కల్పించే ధ్యేయంగా నగరంలో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఫుట్‌పాత్‌లను రక్షించేందుకు, ట్రాఫిక్ నుంచి విముక్తిని కలిగిస్తూ రోడ్లను, జంక్షన్లలో ఆక్రమణలను తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే ప్రజల్లో పౌర స్పృహ పెంపొందించి, నగర సౌందర్యం, ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకునేందుకు జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నగరంలో ఆక్రమణలను తొలగించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 2.0 కార్యక్రమం ప్రజా సహకారంతో విస్తృతంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం అందరికీ లాభదాయకంగా ఉండి విశాఖ నగరాభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం అత్యంత ముఖ్యమైనదిగా నిలుస్తుందన్నారు. ఆపరేషన్ లంగ్స్ ద్వారా ఆక్రమణలు తొలగింపు కార్యక్రమంలో ఖాళీ చేయబడిన వ్యాపారులను స్ట్రీట్ వెండింగ్ నిబంధనలకు అనుగుణంగా గుర్తించిన వెండింగ్ జోన్లకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలను నమ్మవద్దని, అనధికారికంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లు, జంక్షన్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను తొలగించుకొని జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ ప్రకటన ద్వారా కోరారు.

స్వామికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టం

- చోడె పట్టాభిరామ్



పట్టాభిరామ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో ఆదినారాయణ తదితరులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వరస్వామికి సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని టీడీపీ విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు చోడె పట్టాభిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉషోదయ కూడలిలోని తన కార్యాలయంలో తనను అభినందించేందుకు వచ్చిన పలువురు నాయకులు, అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రుషికొండపై ఆలయం రావడానికి ఎమ్మెల్యే రామకృష్ణబాబు, అప్పటి టీటీడీ ఈవో పోలా భాస్కర్‌రావు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తాను కృషి చేశామన్నారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తగిన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. లాసన్స్ బే కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఈవో ఆదినారాయణ, ఛైర్మన్ గోవిందరెడ్డి, సభ్యులు గొర్లె సుందరి దేముడుబాబు, ఈశ్వరరావు, చల్లా కాటమని రాముడు, దశరథరామ్, పద్మావతి రామిరెడ్డి, అర్చకులు చంద్రశేఖర్, సూర్యనారాయణ అభినందించిన వారిలో ఉన్నారు.

పట్టాభిరామ్‌కు టీడీపీ నేతల సన్మానం..



చోడె పట్టాభిరామ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడుగా నియమితులైన చోడే వెంకటపట్టాభిరామ్‌కు శనివారం 22వ వార్డు తెలుగుదేశంపార్టీ నాయకులు సన్మానం చేశారు. టీడీపీ పార్ల మెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, వార్డు కమిటీ నాయకులు పట్టాభికి పూలబొకెలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడిబోయిన ఆనంద్, నగేష్, పండు, ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి, రాజ్‌కుమార్, జనసేన నాయకులు పోతు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఏయూలో విద్యార్థినుల ఆందోళన

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ఏయూలో ఇంజనీరింగ్ కళాశాల సావిత్రి బాయి హాస్టల్ విద్యార్థినులు శనివారం రాత్రి ఆందోళన చేపట్టారు. వసతిగృహంలోని సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను హాస్టల్ వార్డెన్, సిబ్బంది అడ్డుకోవడమే కాకుండా విద్యార్థినులు కూడా బయటకు రాకుండా నిర్బంధించారు. దీంతో విద్యార్థినులంతా వసతి గృహం వద్ద బైఠాయించి, వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వార్డెన్‌ను తక్షణమే విధుల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థినుల వద్ద నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ఏయూ అధికారులు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. వసతిగృహంలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

మహారాణిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. శరన్నవరాత్రులలో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి విశేష పూజలు చేస్తారు. 22న స్వర్ణకవచ అలంకరణ, 23న ఆదిలక్ష్మి అవతారం, 24న ధనలక్ష్మి, 25న ధాన్యలక్ష్మి, 26న ధైర్యలక్ష్మి, 27న సంతానలక్ష్మి, 28న విజయలక్ష్మి, 29న విద్యాలక్ష్మి, 30న గజలక్ష్మిగా అలంకరిస్తారు. అక్టోబరు 1న మహాలక్ష్మి అవతారం, 2న విజయదశమి రోజు కనక మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలుపుదల చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

దేవీ నవరాత్రి మహోత్సవాలకు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

మురళీనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ నూకాంబిక ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ అర్చకుడు బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఈఓ పర్యవేక్షణలో మహిళల సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయి. ఆలయ ఆవరణలోనే ప్రత్యేక దేవీ ప్రతిమను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాల ముగింపు తర్వాత అనుపు ఉత్సవం, సామూహిక సహపంక్తి భోజనాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మాధవధార జీవీఎంసీ హైస్కూలు దగ్గరి లలితాదేవి ఆలయం, సీతన్న గార్డెన్స్‌లోని కనక మహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, ఉత్సవ పూజాకార్యక్రమాల నిర్వహణకు ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వృత్తివిద్యల అభివృద్ధిపై సమావేశం

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఆధ్వర్యంలో జిల్లాలో వృత్తి విద్య అభివృద్ధిపై కీలక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డా.జె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలికల అభివృద్ధి అధికారి గుమ్మడి శ్రీదేవి, జిల్లా వొకేషనల్ కో-ఆర్డినేటర్ రిషి, వృత్తి శిక్షకులు పాల్గొన్నారు. ముఖ్యంగా నైపుణ్య లోటును తగ్గించడం, ఆర్థిక సాధికారతను పెంపొందించడం, జాతీయ నైపుణ్య కార్యక్రమాలతో అనుసంధానం, ఈ నెల 22 నుంచి దసరా సెలవుల సమయంలో విద్యార్థుల కోసం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభంపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ పాఠశాలకు 100 పుస్తకాలు, 100 డైరీల పంపిణీ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్థిరమైన జీవనోపాధి పొందేలా సహాయ పడుతుందని ఏపీసీ చంద్రశేఖరరావు తెలియజేశారు.

లేపాక్షిలో విక్రయాలపై ప్రత్యేక డిస్కౌంట్లు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హ్యాండిక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదేశం మేరకు లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ ఎంపోరియం ఫెస్టివల్ డిస్కౌంట్ అవకాశం అక్టోబరు 1 వరకు ఇస్తున్నట్టు మేనేజర్ తెలిపారు. సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడం, పండుగ సీజన్‌లో స్థానిక శిల్పకారుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడం లక్ష్య మన్నారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్‌పై 10 శాతం, అన్ని హ్యాండిక్రాఫ్ట్‌లపై 15 శాతం, ముత్యాలు, ఆభరణాలు, గంధపు చెక్కపై 10 నుంచి 15 శాతం, ఎంపిక చేసిన కొన్ని క్రాఫ్ట్‌పై 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ అందుబాటులో ఉందన్నారు. వినియోగదారులు లేపాక్షి ఎంపోరియాన్ని సందర్శించి శిల్పకారులను ప్రోత్సహించాలని కోరారు.


కంచరపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


వుడా కాంప్లెక్సు ఫుట్‌పాత్‌పై తొలగింపులు


సీతమ్మధారలో జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

రహదారి ఆక్రమణలపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంచరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రధాన రోడ్డు, సర్వీస్ రోడ్లలో ఆక్రమణలపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురించిన కథనానికి స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆక్రమణల తొలగింపులో నిమగ్నమయ్యారు. పోలీసుల సమక్షంలో ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వరకు గల సర్వీస్ రోడ్డులో దుకాణాలు, తోపుడు బండ్లు,రోడ్డుపైకి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ఎక్స్‌కవేటర్స్ పొక్లెయిన్స్ సహాయంతో ఎక్కడికక్కడ దుకాణాలు, ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఆక్రమణలు తొలగించడంతో రోడ్డు మార్గం పూర్తిగా విశాలంగా మారి ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలు, పాదచారుల రాకపోకలు సజావుగా జరిగాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇదే నిఘాను నిత్యం ఏర్పాటు చేస్తే ఆక్రమణల సమస్య పునరావృతం కాదని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ దిశగా టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆ రెండు మార్గాల్లో తొలగింపునకు డిమాండ్

కంచరపాలెం మెట్టు ముత్యమాంబ గుడి నుంచి పాత రామారావు ఆసుపత్రికి వెళ్లే మార్గంలో కిరాణాకు దుకాణాలు ఇబ్బడిముబ్బడిగా ఉండి రోడ్డు మీదే సరుకులు ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. దుకాణాలకు సరుకులు తీసుకువచ్చే భారీ వాహనాలతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపో యి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ట్రాఫిక్ దుస్థితిపై సమీపంలో గల గంగన్ననగర్, యల్లబిల్లి వారి వీధికి చెందిన స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాలతో ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగిస్తున్న నేపథ్యంలో ఈ మార్గంలో కూడా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కంచరపాలెం మెట్టు బస్టాప్ నుంచి జాషువానగర్ మీదుగా జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డు మీదే ఆక్రమణలతో వ్యాపారాలు చేస్తున్నారు. ఈ మార్గంలో కూడా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సీతమ్మధారలో ఫుట్‌పాత్‌పై..

సీతమ్మధార, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రధాన రహదారి, గురుద్వార నుంచి ఎన్ఆర్ఐ ఆసుపత్రి వరకు జీవీఎంసీ జోన్-3 ఏసీపీ మధుసూదనరావు పర్యవేక్షణలో శనివారం ఆక్రమణలు తొలగించారు. సీతమ్మధార ప్రధాన రహదారిలో తోపుడు బండ్లు, పీ అండ్ టీ కాలనీలో గల వుడా కాంప్లెక్సు షాపింగ్స్‌లో ఫుట్‌పాత్‌పై షెడ్లు, స్టాండ్‌లను జేసీబీ సాయంతో తొలగించారు. దీంతో ఆయా దుకాణదారులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు లబోదిబోమంటూ కంట తడిపెట్టారు. చిరు వ్యాపారాలతో కుటుంబాలు పోషిస్తున్నామని, తమ బతుకులు వీధినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీతమ్మధార రైతు బజార్ ప్రాంతంలో గల కొన్ని దుకాణాల వారికి రెండు రోజులు గడువు ఇచ్చినట్లు ఏసీపీ తెలిపారు. రోడ్లను ఆక్రమించిన వారిని ఎవరినీ ఉపేక్షించేది లేదని, దుకాణాలన్నింటినీ తొలగిస్తామన్నారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం విస్తృత తనిఖీలు


ప్లాట్‌ఫామ్‌పై కుళాయి నుంచి నీటిధారను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేపట్టారు. రానున్న దసరా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు కల్పించే సౌకర్యాల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే ప్రయాణికులకు కల్పించాల్సిన అదనపు సదుపాయాలపై సమీక్షించారు. ప్లాట్‌ఫామ్‌లపై రూఫింగ్, పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణతోపాటు ఎస్కలేటర్లు, లిఫ్టుల పనితీరు, తాగునీరు లభ్యత, కోచ్‌ల్లో సరఫరా చేసే లెనెన్ శుభ్రతను తనిఖీ చేశారు. అలాగే వెయిటింగ్ హాల్స్, ఏసీ లాంజ్‌ల నిర్వహణతోపాటు ఫుట్ కోర్టులు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. రద్దీ సమయంలో చేపడుతున్న భద్రతా చర్యలపై అధికారులతో మాట్లాడారు. అలాగే స్టేషన్‌లో సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణపై ప్రయాణికులతో నేరుగా మాట్లాడి తెలుసుకుని పరిశుభ్రత పాటించడంలో భాగస్వాములై చెత్తను డబ్బాల్లో పారవేయడం, రైల్వే అమలు చేస్తున్న మార్గదర్శకాలను పాటించాలని ప్రయాణికులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిని డీఆర్ఎం సమీక్షించారు. బుకింగ్ కార్యాలయం, పార్శిల్ కార్యాలయం వద్ద ప్రయాణికులకు నిబద్ధతతో కూడిన సేవలందించాలని, అలాగే ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించి అనుకూల వాతావరణం కల్పించి సురక్షిత ప్రయాణాన్ని అందించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతోపాటు కమర్షియల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెలుగుభాష ఔన్నత్యానికి గురజాడ విశేష కృషి


గురజాడకు నివాళులర్పిస్తున్న హెచ్ఎం రాజ్యలక్ష్మి, బొట్టా ఈశ్వరమ్మ, విద్యార్థినులు

కంచరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సీపీఎం, ఐద్వా నాయకులు శనివారం ఆర్పీపేట పాఠశాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కంచరపాలెం జోన్ ఐద్వా మహిళల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఆర్పీపేట పాఠశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్ర పటానికి హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి నివాళులర్పించారు. గురజాడ తన కవిత్వం ద్వారా తెలుగు భాష ఔన్నత్యం కోసం చేసిన కృషి అజరామరమన్నారు. నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాతి పొందిన గురజాడ జీవిత విశేషాలను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఐద్వా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ అనర్థాలు



అల్లిపురంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అల్లిపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారి పి.వి.వి.రాజు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంజీఎం జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో నష్టపోతున్నామని, మూగజీవుల ప్రాణాలు తీస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అందరూ ప్లాస్టిక్ వినియోగం మానేసి జూట్ వినియోగిస్తే మేలు చేకూరుతుందన్నారు.

కంచరపాలెం: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం అసమతుల్యమై మానవ మనుగడకే ముప్పు వాటిల్లనుందని జీవీఎంసీ కె.మర్రిపాలెం, ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు వీధుల్లో ప్లకార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎంలు అనూష, స్వర్ణకుమారి మాట్లాడుతూ మితిమీరిన ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్, చర్మ రోగాలు తదితర భయంకర అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరం కృషిచేయాలని కోరారు. మంచినీటిని పొదుపుగా వినియోగించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్.విజయలక్ష్మి, మహ్మద్ ఇర్ఫాన్, బొడ్డు శిరీష, నూకరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: కెఆర్ఎం కాలనీ, నక్కవానిపాలెం, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా పార్కులో మొక్కలు నాటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, పచ్చదనం కోసం మొక్కలు నాటాలని, పొడి చెత్తను, తడి చెత్తను వేరు వేరుగా ఇంటి వద్ద వచ్చిన వాహనాలకు ఇవ్వాలని అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. టెర్రస్‌పై మొక్కలు నాటాలని, ప్రతి ఇంటి వద్ద హోమ్ కంపోస్టింగ్ చేయడం ద్వారా ప్రజలను రోగాల బారి నుంచి కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, అటెండర్ సతీష్‌లు బజార్ వద్ద మొక్కలు నాటారు. బజార్‌ను రైతులు, సిబ్బంది కలసి శుభ్రం చేశారు.

'వైద్య కళాశాలలపై వైసీపీ అసత్య ప్రచారం'

మహారాణిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల అంశంపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ విమర్శించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం 17 కళాశాలలు ప్రారంభించామని చెప్పటం అబద్ధమని, వాటికి ఎన్ని నిధులు కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు



సదస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునని, ఇప్పటికే చాలామంది రోగులు ఈ విషయాన్ని నిరూపించారని ఐఎఫ్ఎస్ ఎ.నీరజా అన్నారు. క్యాన్సర్ క్యూర్ ట్రస్ట్, సంకల్ప్ ట్రస్ట్, మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 2వ క్యాన్సర్ క్యూర్ వార్షిక అంకాలజీ సదస్సు శనివారం రాత్రి బీచ్‌రోడ్డులో ఉన్న రాడిసన్ బ్లూలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, జీవన శైలి ద్వారా క్యాన్సర్‌ను దూరం చేయవచ్చునన్నారు. చికిత్సలో అధునాతన వైద్యం అందుతోందని, రోగులు మానసికంగా దృఢంగా ఉంటే ఏమీ కాదని చెప్పారు. డీఆర్‌డీఓ ఛైర్మన్ జి.సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని, త్వరలోనే పరిశోధనలు ఫలాలు రోగులకు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీపీ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ అంకాలజిస్టులు, పరిశోధకులు ఎప్పటికప్పుడు వైద్యంలో వస్తున్న మార్పులను గమనించి, మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రముఖ నిపుణులు డాక్టర్ రఘునాథ్, సుమన్ చక్రవర్తి మాట్లాడారు. అనంతరం సమాజంలో క్యాన్సర్ నివారణకు కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను నిర్వాహకులు సత్కరించారు. ఈ సదస్సులో దేశీయ, అంతర్జాతీయ అంకాలజిస్టులు, శస్త్రచికిత్స నిపుణులు, రేడియాలజిస్టులు, పరిశోధకులు పాల్గొన్నారు.


12న వైజాగ్ హాఫ్ మారథాన్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 12న వైజాగ్ హాఫ్ మారథాన్ 4వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రేస్ డైరెక్టర్ డాక్టర్ కె.కృష్ణచైతన్య తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గీతం విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభమయ్యే మారథాన్‌లో 21కే, 10కే, 5కే, 3కే విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఔత్సాహికులు తమ పేర్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వీటీఆర్ఏ.రన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అసోసియేట్ స్పాన్సర్‌గా ఐడీబీఐ బ్యాంక్, డెకథలాన్ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏఎస్ఆర్‌నగర్ పీహెచ్‌సీలో ఆరోగ్య పరీక్షలు

మాధవధార, 20 సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ ఏఎస్ఆర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టినట్లు వైద్యులు వెంకటేష్ తెలిపారు. 100 రోజులు ఈ కార్యక్రమం నిరంతరం జరిగేలా దిశా నిర్దేశం చేశారు. డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు, బిజెపి నాయకురాలు దీపికా శ్యామల, వార్డు నాయకులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


సిస్టర్ బీకే శశికళ

కంచరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రైల్వే న్యూ కాలనీ బ్రహ్మకుమారీస్ టీచర్ ఇన్‌ఛార్జి సిస్టర్ బీకే శశికళ హితవు పలికారు. స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో శనివారం యువశక్తి సాధన-మత్తు వ్యసన విరోధప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిస్టర్ శశికళ విద్యార్థులకు సద్గుణాలను తెలియజేశారు. యువత ఆరోగ్యవంతులైతేనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ మంచి విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు బ్రహ్మకుమారీస్ యువజన విభాగం నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. డా.కె.యశ్వంత్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి-సానుకూల దేశ నిర్మాణం అనే అంశంపై వివరించారు. సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రత, శుభ్రతతో పాటు పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన విశాఖ నగర విశిష్టత, ప్రాముఖ్యత మరింత పెంచేలా ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కార్యదర్శి కాటంనేని భాస్కర్ సూచించారు. ఈనెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న ఈ-గవర్నెన్స్ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రంగాల నిపుణులు, అతిథులు వస్తున్నార న్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర ఐటీ మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు సదస్సులో భాగస్వామ్యులవుతారని, అందువల్ల పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజులపాటు జరిగే సదస్సుకు వెయ్యి మంది అతిథులు హాజరుకానున్నా రన్నారు. సదస్సు జరిగే చోట రిజిస్ట్రేషన్ల కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాట్లుచేయాలని, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ వద్ద హోర్డింగ్‌లు పెట్టాలన్నారు. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు అనుగుణంగా నియమించిన కమిటీలు, ఇప్పటివరకూ చేపట్టిన పనులను వివరించారు. సమీక్షలో జేసీ కె.మయూర్ అశోక్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ సూర్యతేజ, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో పని చేసే ఉద్యోగుల కోసం లీ హెల్త్ డొమైన్, లీఫార్మా సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెవెన్యూ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ సందర్శించి పలు పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ఆంత్రోపోమెటిక్ కొలతలు, చేతిపట్టు బలం, శరీరం కూర్పు, ఎముకల ఖనిజ సాంద్రత పరీక్షలు చేశారు. డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏవో బీవీ రాణి. రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు త్రినాథ్, శ్యాం, రాజేంద్రవర్మ, తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో డాక్టర్ రాధిక, డాక్టర్ మాధురి, కంపెనీ ప్రతినిధులు అల్లా లీలారాణి, సరోజిని, జయలక్ష్మి, భాగ్యలత, తదితరులు పాల్గొన్నారు.

140 కోట్ల మందికి జీఎస్‌టీ లబ్ధి

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నదని, అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్థిక సంస్కరణలతో మనదేశం మాత్రం అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందన్నారు. అన్ని రంగాల్లోనూ అత్యు న్నత ప్రతిభ చూపుతూ ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామన్నారు. జీఎస్‌టీ స్లాబుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు సురేంద్రమోహన్, నాగేంద్ర, సుహాసిని ఆనంద్, ఉమ్మడి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న చైన్‌స్నాచర్లు

... 5వ పేజీ తరువాయి

వస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును తెంచుకుపోయారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి సీ హార్స్ జంక్షన్‌లో నడుచుకుంటూ టౌన్‌కొత్తరోడ్డువైపు వెళుతున్న మహిళ మెడలోని తులం చైన్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు తెంచుకుని పరారైపోయారు. చైన్‌స్నాచర్లు బలంగా ఆమె మెడలోని చైన్‌ను లాగడంతో అదుపుతప్పిన ఆమె తూలి కిందపడిపోయింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఒకేరోజు గంటల వ్యవధిలో మూడుచోట్ల చైన్‌స్నాచింగ్‌లు జరగడంతో సీపీ శంఖబ్రతబాగ్చి సీరియస్‌గా తీసుకున్నారు. నేరం జరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా చైన్‌స్నాచర్లు వినియోగించిన వాహనాలు, వారి ఫొటోలు, వీడియోలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. నేరానికి పాల్పడినవారు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. వారి కోసం ప్రత్యేక బృందాలతో వివిధ రాష్ట్రాలకు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

వైద్య సేవల్లోనూ కోత!

... 5వ పేజీ తరువాయి

ప్రాంత ప్రజలు, ఉద్యోగులకు ఉపయోగపడేలా దీనిని నలుగురు వైద్యులతో చాలాకాలంగా నడుపుతున్నారు. ముగ్గురు వైద్యులు పగటిపూట, రాత్రివేళ ఇంకో డాక్టర్ ఉండేవారు. వీరికి సాయంగా నర్సులు, కాంపౌండర్, పారిశుధ్యం సిబ్బంది ఉండేవారు. నాలుగు రోజుల క్రితం యాజమాన్యం ఒక నోటీసు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీ నుంచి అంటే సోమవారం నుంచి కేవలం జనరల్ షిఫ్ట్‌లోనే ఈ హెల్త్ సెంటర్ పనిచేస్తుందని ప్రకటించింది. అంటే ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెరిచి ఉంచుతారు. ఆ తరువాత మూసేస్తారు. రాత్రిపూట వైద్యం అందదు. ప్రస్తుతం ఈ కేంద్రానికి ఒకే ఒక వైద్యుడు ఉన్నారు. ఆయనతోనే నడుపుతున్నారు. ఇంతకుముందు రోజుకు 150 నుంచి 200 మంది ఇక్కడికి వైద్యం కోసం వచ్చేవారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో రోగులు కూడా తగ్గిపోయారు. ప్రస్తుతం జ్వరానికి మందులు తప్ప ఇంకేమీ ఇవ్వడం లేదు. గాయాలతో వచ్చిన వారిని కూడా ప్రధాన ఆస్పత్రికి పంపించేస్తున్నారు. క్రమంగా దీనిని మూసేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. దీనిపై పెదగంట్యాడ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఎప్పటిలాగే రాత్రిపూట కూడా నడపాలని కోరుతున్నారు.

ప్రశంసే ఆమెకు పెద్ద బహుమతి

... 5వ పేజీ తరువాయి

వాళ్లను ప్రశంసించేలా 'వైఫ్ అప్రిషియేషన్ డే'ను ఏటా సెప్టెంబర్ మూడో ఆదివారం నిర్వహిస్తున్నారు. దీని వెనుక కచ్చితమైన చరిత్ర లేకపోయినా..ఇటీవల కాలంలో ఈ రోజుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

పైకి చెప్పరు...

మహిళలతో పోలిస్తే..పురుషుల్లో భావవ్యక్తీకరణ చాలా తక్కువ. భార్యపై ఎంత ప్రేమ ఉన్నా..బయటకు చెప్పే నేర్పు చాలామంది పురుషుల్లో లోపిస్తోంది. ఆమె పడ్డ శ్రమను లోలోనే అభినందిస్తారు తప్ప..ఆమెతో నేరుగా చెప్పరు. అదే భార్యలో అసంతృప్తికి కారణమవుతోంది. 'కోడి కూసిన దగ్గర నుంచి గొడ్డులా కష్టపడినా...ఈ కొంపలో గుర్తింపు ఉండదు' అనే బాధ చాలా మందిలో కనిపిస్తుంది. మనకోసం అనుక్షణం కష్టపడే ఆమెను ప్రశంసించడం నేరం కాదన్న విషయాన్ని గుర్తించాలి. ఆమె శ్రమను గుర్తించాలి. ఆమె చేసే మంచి పనిని గుర్తించి ప్రశంసించాలి. మనసులో గంపెడు ప్రేమ ఉన్నా..వ్యక్తీకరించకుంటే నిష్ఫలమే. అందుకే ఆమెపై ఉన్న ప్రేమాభిమానాలను ఎప్పటికప్పుడు వ్యక్తీకరించాలి.

భార్యకు ప్రాధాన్యం ఇవ్వండి

భార్యకు అన్ని విషయాల్లో ప్రాముఖ్యం ఇస్తే ఆమె సంబరపడుతుంది. కుటుంబ విషయాలన్నీ ఆమెతో పంచుకుని ఆమె సలహాలు తీసుకోవడం వల్ల మరింత సంతోషంగా ఉంటుంది. అలాగే ఎంత బిజీగా ఉన్నా వారానికి ఒక్క రోజైనా.. కుటుంబంతో కలిసి గడిపేందుకు ప్రయత్నించండి. రోజులో ఎంత బిజీగా ఉన్నా..కొంత సమయాన్ని ఆమెతో మాట్లాడేందుకు కేటాయించండి. అలాగే ఆమెతో ఉన్న జ్ఞాపకాలను ఎప్పటికప్పుడు గుర్తుచేసుకోండి. ప్రత్యేక దినాల్లో ఆమెను డిన్నర్‌కు తీసుకువెళ్లే ప్రయత్నం చేయండి.

పనిలో సాయపడాలి

ఆమెకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే..మీరు ఓ చేయి వేయండి. పనిలో ఆమెకు సహకరించండి. ఆమెకు మీరు చేసే చిన్నపని వల్ల శారీరకంగా శ్రమ తగ్గకపోయినా.. మానసికంగా కలిగే ఆనందం వెల కట్టలేం.

గౌరవించండి

ఆమెకు గౌరవాన్ని ఇవ్వండి. ఆమె మాటకు విలువ ఇవ్వండి. పది మందిలో ఆమెను చులకన చేయకండి. వీలైతే పది మందిలో ఆమె గొప్పతనాన్ని షేర్ చేసుకోండి. విమర్శలు అందరి మధ్యా చేయకండి. ఏదైనా లోపం ఉంటే ఆమెకు ఒంటరిగా చెప్పండి. అదే ఆమెకు ఇచ్చే గౌరవం అని గుర్తుంచుకోండి.


రైతు బజార్ ప్రహరీ వద్ద పిచ్చి మొక్కలు పీకుతున్న రైతులు

రైతు బజారులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లోని రైతు బజార్ పరిసరాలను శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.చినబాబు రైతులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వినియోగదారుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

87 వార్డులో

కూర్మన్నపాలెం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తిరుమల నగర్ కాలనీ ప్రతినిధి జి.విశ్వేశ్వరరావు అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కాలనీలోని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. తడి చెత్త పొడి చెత్త విడివిగా ఇవ్వాలని ఎరుపు రంగు డబ్బాలో ప్రమాదకర చెత్త వేరు చేసి కార్పొరేషన్ సిబ్బందికి అందించాలని అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు మాట్లాడుతూ పర్యావరణ రక్షణ కోసం ఎవరూ కూడా ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ప్రభావంపై సదస్సు రేపు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రభావంపై సోమవారం స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో సాయంత్రం ఆరు గంటలకు సదస్సు నిర్వహించనున్నామని ప్లాంటు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే నియమించాలని, అర్హులకు ప్రాధాన్యత ఇవ్వాలనే తదితర అంశాలపై ప్రసంగాలు జరగనున్నాయని అన్నారు.

దస్తావేజు లేఖర్ల నిరసన

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలోని నూతనంగా ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0లో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు శనివారం షీలానగర్‌లోని గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాజువాక దస్తావేజు లేఖర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రి సత్యారావు మాట్లాడుతూ కార్డు ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్ ప్రక్రియంలో ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ జరుగుతుండడంతో అటు ప్రజలకు, ఇటు దస్తావేజు లేఖర్లకు సమయం వృథా అవుతోందని అన్నారు. దీంతో అనేక దస్తావేజు లేఖర్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు(కిలో)48, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి(పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 38, కంద 50, దేముడుచిక్కుడు 708, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

సాగరగిరి దుర్గమ్మను చూసొద్దామా..

- రేపటి నుంచి అక్టోబరు 2వ తేదీ (విజయదశమి) వరకు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే అవకాశం
- ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.40


సాగరగిరి కనకదుర్గమ్మ



దుర్గమ్మ ఆలయానికి బోటులో ప్రయాణం (ఫైల్), ఆలయానికి వెళ్లే మెట్ల మార్గం

మల్కాపురం/మహారాణిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగరంలో కొంతదూరం బోటులో ప్రయాణించి యారాడ కొండపై కొలువుదీరిన సాగరదుర్గ అమ్మవారిని దర్శించుకోవడం సందర్శకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. ఇటువంటి మధురానుభూతిని పొందాలంటే విశాఖలోని పాత పోస్టాఫీసు వద్దనున్న పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న జెట్టీ నుంచి బోటులో ప్రయాణించి యారాడ కొండపై ఉన్న సాగరగిరి కనకదుర్గమ్మను దర్శించుకోవాలి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మాత్రమే ఈ అమ్మవారిని బోటులో వెళ్లి దర్శించుకునే అవకాశం ఉంది. సముద్రం ఆవల ఉన్న డాల్ఫిన్ నోస్ (యారాడ) కొండ మీద సాగరదుర్గ అమ్మవారు సంద్రానికి దగ్గరగా కొండపై వెలసి ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా భక్తులతో పూజలందు కుం టున్నారు. చాలాకాలం పాటు విశాఖ వాసులు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునేవారు. అయితే నేవల్, పోర్టు అధికారులు దేశ రక్షణ అవసరాల నిమిత్తం సున్నితమైన ప్రాంతం కావ డంతో సాధారణ ప్రజలు బోటులో వెళ్లడాన్ని నిషేధించారు. దీంతో అమ్మవారి దర్శనానికి బోటు ప్రయాణం ఆగిపోయింది. ఒకవేళ సాగరగిరి దుర్గమ్మను దర్శించాలనుకుంటే సింధియా నుంచి బస్సులో వెళ్లవచ్చు. అయితే అది దూరభారంతో కూడుకున్నది. కానీ పాత పోస్టాఫీసు నుంచి సుమారు 10 నిమిషాలపాటు బోటులో ప్రయాణించి, అక్కడనుంచి నడిచి కొండెక్కి దుర్గమ్మను దర్శించుకోవడం ఎంతో మధురానుభూతిని మిగుల్చుతుంది. సువిశాలమైన సాగర తీరాన్ని కొండపై నుంచి చూస్తే చక్కటి అనుభూతిని అందిస్తుంది. కాగా పోర్టు అధికారులు ఏటా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు బోటు ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు బోటులో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే భాగ్యం ప్రజలకు లభిస్తుంది. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోట్ల ద్వారా రాకపోకల సౌకర్యం ఉంటుంది. టికెట్ ధర ఒక్కొక్కరకి రూ.40గా నిర్ణయించారు.

ఆలయంలో 18 శక్తి పీఠాలు

కాగా సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయం చుట్టూ 18 శక్తి పీఠాలు ఉన్నాయి. శ్రీలంక శాంకరిదేవి, తమిళ నాడు కంచి కామాక్షి, పశ్చిమ బెంగాల్ శృంఖలాదేవి, మైసూరు చాముండేశ్వరీదేవి, ఆలంపూర్ (కర్నూలు) జోగులాంబ, శ్రీశైలం భ్రమరాంబికాదేవి, కొల్హాపూర్ మహాలక్ష్మి, మహర్(మహారాష్ట్ర) ఏకవీరిక, ఉజ్జయిని (మధ్యప్రదేశ్) మహాకాళి, పిఠాపురం పురుహూతిక (ఏపీ), ఓఢ్య (ఒడిశా) గిరిజాదేవి, ద్రాక్షారామం (ఏపీ) మాణిక్యాంబ, హరిక్షేత్ర (గౌహతి) కామరూపాదేవి, ప్రయాగ (అలహాబాద్), జ్వాలాక్షేత్రం (హిమాచలప్రదేశ్) వైష్ణవీ దేవి, గయ (బిహార్) మంగళగౌరి, కాశీ విశాలక్ష్మి (ఉత్తర ప్రదేశ్), జమ్ము కశ్మీర్ సరస్వతీదేవి పీఠాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

అగనంపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ-స్వశక్త్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటే అంతా బాగుంటుందని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఆస్పత్రిలో సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, ఆస్పత్రి సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో....

రోగులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల సందర్భంగా అక్కిరెడ్డిపాలెంలో శనివారం పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తుంగ్లాం శివాలయం వద్ద కూటమి నాయకుడు కరణం ముత్యాలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ రాటను వేశారు.

తీర ప్రాంత పరిరక్షణ అందరి బాధ్యత

- ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ అప్ డే కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్


తీరంలోని వ్యర్థాలను సంచిలో వేస్తున్న శ్రీభరత్, తదితరులు

విశాఖపట్నం సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత పరిరక్షణలో, పరిశుభ్రంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శనివారం ఆర్కే బీచ్ వద్ద తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ అప్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తీరానికి వచ్చే సందర్శకులు ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను పడేస్తుండడం శోచనీయమని, ఇకపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంతాల పరిశుభ్రత వల్ల సముద్ర జీవరాశులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా అందరూ క్లాత్, పేపర్ బ్యాగులు, గాజు, స్టీల్ పాత్రలను వినియోగించాలని సూచించారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీ, కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు నేవీ ఉద్యోగులు, విద్యార్థులు తీరంలోని చెత్తాచెదారం, వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమాండర్ రాజేష్ మిట్టల్, అసిస్టెంట్ కమాండెంట్ సార్థక్ కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో గాయపడిన వారిలో మరొకరి మృతి

మల్కాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న మారుతి సర్కిల్ వద్ద జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన నలుగురిలో రత్నపాప ఈనెల 15 చికిత్స పొందుతూ మృతి చెందగా, ఇదే ప్రమాదంలో గాయపడిన కంకిపాటి వెంకట సత్యనారాయణ రాజు (82) శనివారం మృతి చెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతులు చెందిన వారి సంఖ్య రెండుకు చేరింది. ఇంకా మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ కేసును మల్కాపురం పోలీసు స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

గోపాలపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్జీ పాలిమర్స్ కూడలి నుంచి బంక్ కూడలికి వచ్చే సర్వీసు రోడ్డులో శిథిలమై గుంతలా ఏర్పడిన యూజీడీ మ్యాన్‌హోల్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. 'రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి సం బంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టారు.దీంతో చాలాకాలంగా ఇ బ్బందులు ఎదుర్కొంటున్న వాహన చోదకులకు ఇబ్బంది తొలగిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు

చిరు వర్తకుల నిరసన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న చిరు వ్యాపారులు

వేపగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న తోపుడు బండ్ల తొలగింపునకు నిరసనగా చిరు వర్తకులు శనివారం గోపాలపట్నం నుంచి వేపగుంట జోనల్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బండ్లను తొలగించిన ప్రదేశాల్లోనే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమత ఇవ్వా లని డిమాండ్ చేశారు. 30 ఏళ్లగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా 450 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగింపులు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. స్ట్రీట్ వెండర్స్ కమిటీకి కూడా చెప్పకుండా ఈ విధంగా చేయడం తగదని అన్నారు. జోనల్ కార్యాలయం వద్ద నిరశన తెలియజేసి జడ్సీ హెచ్ శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీటు నాయకులు బలివాడ వెంట్రావు, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల భద్రత, వాహనదారుల రక్షణే ధ్యేయంగా

ఆపరేషన్ లంగ్స్- 2.0 కార్యాచరణ

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో అన్ని ఫుట్‌పాత్‌లను కేవలం పాదచారులు, వాహనాలు లేని వారు సురక్షితంగా నడిచేందుకేనని, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు విశాలమైన రోడ్లు, జంక్షన్లలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా, ప్రజల భద్రత, రక్షణ దిశగా జీవీఎంసీ అధిక మొత్తంలో నిధులను వినియోగిస్తూ ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేయడం జరుగుతుందని కమిషనర్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లు, ప్రధాన జంక్షన్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడు బండ్ల కారణంగా ట్రాఫిక్ పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రధానంగా పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి ట్రాఫిక్ అవరోధం కాకూడదనే ఉద్దేశంతో అనధికార దుకాణాలను తొలగిస్తున్నట్టు స్పష్టం చేశారు. అలాగే ఫుడ్ స్టాళ్ల వద్ద ఆహారం తింటూ పలువురు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రజల భద్రత, రక్షణ, ఆరోగ్య పరిరక్షణతో పాటు ఫుట్‌పాత్‌ల స్వేచ్ఛ, విశాలమైన రోడ్లకు ఉపశమనం, పాదచారులు, వాహనాలు లేని వారికి సురక్షిత మార్గాలు, వాహనదారుల రాకపోకలకు రక్షణ కల్పించే ధ్యేయంగా నగరంలో అందంగా, ఆకర్షనీయంగా తీర్చిదిద్దిన ఫుట్‌పాత్‌లను రక్షించేందుకు, ట్రాఫిక్ నుంచి విముక్తిని కలిగిస్తూ రోడ్లను, జంక్షన్లలో ఆక్రమణలను తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే ప్రజల్లో పౌరస్పృహ పెంపొందించి, నగర సౌందర్యం, ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకునేందుకు జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నగరంలో ఆక్రమణలను తొలగించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 2.0 కార్యక్రమం ప్రజా సహకారంతో విస్తృతంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం అందరికీ లాభదాయకంగా ఉండి విశాఖ నగరాభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం అత్యంత ముఖ్యమైనదిగా నిలుస్తుందన్నారు. ఆపరేషన్ లంగ్స్ ద్వారా ఆక్రమణలు తొలగింపు కార్యక్రమంలో ఖాళీ చేయబడిన వ్యాపారులను స్ట్రీట్ వెండింగ్ నిబంధనలకు అనుగుణంగా గుర్తించిన వెండింగ్ జోన్లకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలను నమ్మవద్దని, అనధికారికంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లు, జంక్షన్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను తొలగించుకొని జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ ప్రకటన ద్వారా కోరారు.

బంక్ కూడలిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు


బంక్ కూడలిలో ఆక్రమణల తొలగింపుపై సిబ్బందికి సూచనలిస్తున్న జడ్సీ కె.శంకరరావు

గోపాలపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌పై ఆక్రమణల్ని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తొలగింపులు చేపడుతున్నారు. స్థానిక బంక్ కూడలిలో కూడా శనివారం ఉదయం ఆక్రమణల్ని తొలగించారు. జడ్సీ కె.శంకరరావు పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగింపు చేపట్టారు. స్థానిక బుధవారం సంత ప్రాంగణంలో పూర్తిగా రహదారి ఆక్రమించి ఆకుకూరల వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం వలన వాహన రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఆకుకూరల వర్తకులు సంత స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని జడ్సీ సూచించారు.

తోపుడు బండ్ల వర్తకుల నిరసన ర్యాలీ

గోపాలపట్నం కూడలి నుంచి బంక్ కూడలి వరకూ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ దుకాణాలను తొలగించడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో వర్తకులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. గోపాలపట్నం నుంచి జోనల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఫుట్‌పాత్ వర్తకులకు, తోపుడు బండ్ల వర్తకులకు వ్యాపారం చేసుకోడానికి వెసలుబాటు కల్పించాలని, హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తోపుడుబండ్ల వ్యాపారులు


బాధితులకు చెక్కును అందజేస్తున్న 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర

కష్టాల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- జీవీఎంసీ 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర

అగనంపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తోందని 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర అన్నారు. 85వ వార్డు తలారీవానిపాలానికి చెందిన సర్వసిద్ధి నూకరాజు 2021లో పిడుగు పడి మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లడంతో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.3లక్షలు మంజూరైంది. ఈ సందర్భంగా ఆ చెక్కును బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, తలారి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకొరు అప్పారావు, డొక్కా రమేశ్, శీరంశెట్టి బాబ్జి, తలారి శ్రీను పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంటర్ కాలేజియేట్ పురుషుల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బహుమతులను అందజేశారు. కబడ్డీ ఫైనల్స్ సమతా కాలేజీ, ఆళ్వార్‌దాస్ డిగ్రీ కాలేజీకి మధ్యఏయూ వ్యాయామ విద్యా విభాగం జిమ్నాజియంలో జరిగాయి. 'ఆళ్వార్' జట్టుకు 33 పాయింట్లు, సమతా కళాశాల జట్టుకు 20 పాయింట్లు రావడంతో ఆళ్వార్‌దాస్ కాలేజీ విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం సాంకేతిక కళాశాలకు, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు మ్యాచ్ నిర్వహించగా, కృష్ణా కాలేజీ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ప్రొఫెసర్ ఎ.పల్లవి, హాస్టల్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎన్ఎం యుగంధర్, కబడ్డి సెలక్షన్ కమిటీ మెంబర్లు, ఐఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.257కోట్ల టర్నోవర్‌తో త్రిఫ్ట్ సొసైటీ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ రూ.257 కోట్ల వార్షిక టర్నోవర్‌తో ప్రగతి పథంలో ఉన్నదని త్రిఫ్ట్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్ అన్నారు. స్టీల్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సొసైటీ 62వ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ 9548 మంది సభ్యులతో సొసైటీ ఉన్నదని, వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం రూ.2.64 కోట్లు లాభం ఆర్జించిందని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 18 శాతం డివిడెండ్ చెల్లిస్తామన్నారు. కోశాధికారి డి.కొండరాజు సవరించిన లెక్కల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.శ్రీనివాస్, పీజీకే.రాజు, ఎంవీ.రమణ, చీఫ్ మేనేజర్ కె.దామోదరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

- పెందుర్తి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత


సబ్ రిజిస్ట్రార్ కీర్తనప్రియకు వినతిపత్ర అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

పెందుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కార్డు ప్రైమ్ 2.0లో సాంకేతిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే యోచన చేయాలని, దస్తావేజు లేఖర్లు, డీటీపీ ఆపరేటర్లు ఇబ్బందులపై పెందుర్తి శాఖ దస్తావేజు లేఖర్లు రెండు రోజులుగా చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రెండు రోజులుగా చినముషిడివాడలో గల సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల దస్తావేజర్లు తమ కార్యాలయాలు మూసి వేసి విధులు బహిష్కరించి పెన్‌డౌన్ చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో దస్తావేజర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్డు ప్రైమ్ 2.0 విధానంలో గల సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి దస్తావేజర్లు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక కూడలి వరకు ర్యాలీ చేసి నినాదాలు చేశారు. అనంతరం దస్తావేజు లేఖర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ సంఘ సభ్యులు సబ్ రిజిస్ట్రార్ కీర్తిప్రియకు వినితిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్డు ప్రైమ్ 2.0 వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆధార్‌కార్డు. ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తులు రిజిస్ట్రేషన్లు నిర్వహణలో కార్డుప్రైమ్ సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలు వలన క్రయవిక్రయాల్లో ఏర్పడుతున్న సమస్యలను సబ్ రిజిస్ట్రార్‌కు వివరించారు. డాక్యుమెంట్ రైటర్స్ విజ్ఞాపన మేరకు సమస్యను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నత అధికారులకు నివేదిస్తామని సబ్ రిజిస్ట్రాన్ కీర్తన ప్రియ తెలిపారు. అంతకుముందు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్‌కు స్థిరాస్తి వ్యాపారులు సంఘీభావం తెలిపారు.

దస్తావేజు లేఖర్ల నూతన కార్యవర్గం

పెందుర్తి శాఖ దస్తావేజు లేఖర్ల నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘ అధ్యక్షుడుగా పొన్నగంటి సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దంతులూరి సుబ్బరాజు (సుధీర్), అముజూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సుంకర రమేశ్, సహాయ కార్యదర్శిగా గొర్లి శంకరరావు, కోశాధికారిగా మునస గురునాథరావు, సభ్యులు బండారు గోవిందరావు, కోసూరి సత్యవతి, బలివాడ సోమేశ్వరరావు, నావేటి కుమార్, పితాని భవానీరత్నాకర్, కొల్లి సురేశ్ నిమమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ గౌరవ అధ్యక్షుడు పితాని నాగరాజు. రాష్ట్ర దస్తావేజర్ల సంఘ ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి బలగ చిన్నారావు, పెంటకోట శ్రీను అభినందించారు. దస్తావేజు లేఖర్లు నామాల సత్యనారాయణ, నంబాళ్ల రాము,, ముక్కు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాలిమెరక జెడ్పీ పాఠశాలలో ఫెన్సింగ్ ట్రయిల్స్


ఫెన్సింగ్ ట్రయిల్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి

పెందుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వాలిమెరక జుత్తాడలో గల జడ్పీ పాఠశాలలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లాల ఫెన్సింగ్ క్రీడకు సంబంధించి ఎంపిక ట్రయిల్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ బొడ్డు చంద్రవాణిప్రకాశ్ హాజరై సంయుక్తంగా ఫెన్సింగ్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. విశాఖ. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ఈఫెన్సింగ్ ఎంపిక ట్రయిల్స్‌కు పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం అప్పలనాయుడు,స్కూల్ కమిటీ చైర్మన్ నక్క చిన్నారావు, పీటీ ఉపాధ్యాయులు రమేశ్, కన్నారావు పాల్గొన్నారు

అనుసంధాన రహదారులపై దృష్టి సారించాలి

» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేసే ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృహత్ ప్రణాళిక రహదారులను నిర్దేశించిన తొమ్మిది నెలల్లోగా పూర్తి చేయాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. వుడా పార్కులో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో స్కేట్ బోర్డు పనులను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో అడవివరం-శొంఠ్యాం, శొంఠ్యాం-గుడిలోవ రహదారుల నిర్మాణ పనులను ప్రణవ్‌గోపాల్, తదితరులు పరిశీలించారు. ఈ పనులు త్వరితంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీప్రసాద్, మధుసూదనరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రవిశంకర్‌చ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలను తుడిచేసే అల్జీమర్స్



ఆంధ్రజ్యోతి (విశాఖపట్నం)

వృద్ధాప్యంలో వేధించే సమస్యల్లో అల్జీమర్స్ ముందంజలో ఉంటుంది. 60 ఏళ్లు దాటిన వారిలో కనిపించే ఈ సమస్యను కుటుంబ సభ్యులు గుర్తించి బాధితులకు అండగా ఉండడం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. అల్జీమర్స్ బారినపడినట్టు కుటుంబ సభ్యులు గుర్తించకపోవడం వల్ల వారి పట్ల వ్యవహరించే తీరు దారుణంగా ఉంటుందని, దీనివల్ల వృద్ధులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని నిపుణులు చెబుతున్నారు. అల్జీమర్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి బాధితులకు కుటుంబ సభ్యుల నుంచి భరోసాను కల్పించాలనే ఉద్దేశంతో ఏటా సెప్టెంబరు నెలను అల్జీమర్స్ మంత్‌గా నిర్వహిస్తుంటారు. అలాగే సెప్టెంబర్ 21న అల్జీమర్జ్ డేగా నిర్వహిస్తూ ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ ఏడాది 'అస్క్ అబౌట్ డిమాన్షియా థీమ్'తో అల్జీమర్స్ డేను నిర్వహిస్తున్నారు. ఆదివారం వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

» 60 ఏళ్లు దాటిన వృద్ధుల్లో పెరుగుతున్న మతిమరపు సమస్య
» చిన్నగా సమస్య మొదలై ఎనిమిదేళ్లలో తీవ్రమయ్యే అవకాశం
» తొలుత చిన్న చిన్న అంశాల్లో మతిమరపు.. ఆ తరువాత పూర్తిగా మరిచిపోయే చాన్స్
» బాధితులకు కుటుంబ సభ్యుల సహకారం అవసరమంటున్న వైద్యులు
» కేజీహెచ్‌లో నిర్వహించే ఓపీకి నెలకు 50 మంది వరకు రోగుల రాక
» నేడు వరల్డ్ అల్జీమర్స్ డే

అలోయిస్ అల్జీమర్స్ అనే జర్మన్ మానసిక శాస్త్రవేత్త 1906లో తొలిసారిగా ఈ వ్యాధి గురించి వివరించడంతో దీనికి అల్జీమర్స్ అని ఆయన పేరునే పెట్టారు. ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబరు 21న వరల్డ్ అల్జీమర్స్‌డే, సెప్టెంబరును అల్జీమర్స్ మంత్‌గా నిర్వహిస్తూ వస్తున్నారు. అల్జీమర్స్ డేను వరల్డ్ అల్జీమర్స్ అసోసియేషన్ ఈ ఏడాది డిమాన్షియా గురించి అడగండి అనే థీమ్‌తో నిర్వహిస్తుంది.

మెదడుకు సంబంధించిన వ్యాధి

అల్జీమర్స్ మెదడుకు సంబంధించిన తీవ్రమైన వ్యాధుల్లో ఒకటి. అల్జీమర్జ్ అంటే మతిమరపు అని అర్థం. 60 ఏళ్లు దాటిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. జన్యుపరమైన కారణాల వల్ల రెండు నుంచి మూడు శాతం మందిలో 40 ఏళ్లు దాటిన వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ఐదేళ్లకు ఒకసారి తీవ్రమవుతూ ఉంటుంది. అంటే జ్ఞాపక శక్తిని మరిచిపోయే వాటి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. అల్జీమర్స్ 60 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే కనిపించే సమస్య.

నాలుగు రకాలు..

మతిమరపు సమస్యను 4 రకాలుగా చెబుతారు. ప్రీ క్లినికల్ డిమాన్షియా, మైల్డ్ అల్జీమర్స్, మోడరేట్ అల్జీమర్స్, సివియర్ డిమాన్షియా. ప్రీ క్లినికల్ డిమాన్షియాను మొదటి దశగా చెప్పవచ్చు. ఇందులో కొన్ని రకాల పరీక్షల ద్వారా సమస్యను ముందుగా గుర్తిస్తారు. బయో మార్కర్ టెస్ట్ చేసి దీనిని గుర్తించడం జరుగుతుంది. ఈ దశలో లక్షణాలు పెద్దగా కనిపించవు. మైల్డ్ అల్జీమర్స్ దశలో రోగి వేగంగా కొన్ని విషయాలను మరిచిపోతుంటారు. నగదు లావాదేవీలు చేయలేకపోవడం, అడ్రస్ మరిచిపోవడం వంటి ఇబ్బందులు ఉంటాయి. క్రమంగా జ్ఞాపకశక్తి తగ్గుముఖం పడుతుంది. మూడో దశలో మోడరేట్ అల్జీమర్స్ వస్తుంది. మతిమరపు ఎక్కువగా ఉంటుంది. అడిగిన ప్రశ్నలనే పదే పదే అడగడం, చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పడం చేస్తుంటారు. ఇంట్లో వాళ్లు ఈ తరహా వైఖరితో ఇబ్బందులు పడుతుంటారు. బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేకపోవడం, బాత్రూమ్, ఇతర అవసరాలను మర్చిపోవడం, యూరిన్ పోసేయడం, భ్రమిస్తూ మాట్లాడడం, అనుమానించడం వంటి సమస్యలుంటాయి. నాలుగో దశను సివియర్ డిమాన్షియాగా పేర్కొంటారు. ఈ దశలో యూరిన్, మోషన్ వంటివన్నీ బెడ్ మీదే కానిచ్చేస్తారు. బంధువులు, కుటుంబ సభ్యులను గుర్తించలేరు. మొదటి దశ నుంచి నాలుగో దశకు చేరుకునేందుకు ఎనిమిది నుంచి 12 ఏళ్ల సమయం పడుతుంది. కొన్నిసార్లు ఐదారేళ్లలో కూడా ఈ పరిస్థితికి చేరుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఇదీ చికిత్స: అల్జీమర్స్ వ్యాధి తీవ్రత, లక్షణాలను బట్టి చికిత్సను అందిస్తారు. నాన్ డ్రగ్స్‌లో భాగంగా మెదడుకు మేత పెట్టే అంశాలపై దృష్టి సారించే లా చేసి మరిచిపోకుండా చేయవచ్చు. ఉదయాన్నే వాకింగ్ చేయడం, పిల్లలతో ఆటలాడడం, పజిల్స్ సాల్వ్ చేయడం, సీరియల్స్, సినిమాలు వంటి చూసేలా చూడాలి. తాజా కాయగూరలు, పండ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకునేలా చూడాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.

ఇవీ లక్షణాలు..

అల్జీమర్‌తో బాధపడే వారిలో కొన్ని లక్షణాలు ఉంటాయి. మూడు రకాల మెమోరీని నెమ్మదిగా లాస్ అవుతుంటారు. సాధారణంగా ప్రతిఒక్కరిలో తక్షణ జ్ఞాపకశక్తి, రీసెంట్ జ్ఞాపకశక్తి, రిమోట్ మెమోరీ అనేవి ఉంటాయి. అల్జీమర్‌తో బాధపడేవారు ఈ మూడింటిని పూర్తిగా మరిచిపోతుంటారు.

కుటుంబ సభ్యుల సహకారమే కీలకం

-డాక్టర్ బుచ్చిరాజు, న్యూరాలజీ వైద్య నిపుణులు



అల్జీమర్స్ వ్యాధి వృద్ధాప్యంలో వచ్చే సర్వసాధారణమైనది. 60 ఏళ్లు దాటిన వారిలో ప్రారంభమయ్యే సమస్య 8 నుంచి 12 ఏళ్లలో తీవ్రమవుతుంది. రోజులు గడుస్తున్నకొద్దీ మరిచిపోయే వాటి సంఖ్య పెరుగుతుంది. చివరి దశకు చేరుకునేసరికి ఇల్లును, కుటుంబ సభ్యులను, ఇంట్లోని రూమ్‌లను మరిచిపో వడం, యూరిన్ పోసేయడం వంటి ఇబ్బందులు ఏర్పడతాయి. ఆ సమయంలో కుటుంబం నుంచి సహకారం తప్పనిసరిగా అవసరం అవుతుంది. చిన్నపిల్లాడి మాదిరిగా వారిని ట్రీట్ చేయాలి. మందులతో పాటు మెదడుకు మేత పెట్టే కార్యక్రమా లను నిర్వహించడం ద్వారా కొంతవరకు సమస్యను అదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడు మృతి

» మృతుని స్వస్థలం నగరంలోని హనుమంతవాక



వంకల సత్యం (ఫైల్)

కశింకోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం వాకపాడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందారు. కశింకోట మండలంలోని బయ్యవరం హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం కూడలి వద్ద శనివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖనగరంలోని హనుమంత వాక డెయిరీ ఫామ్ ప్రాంతానికి చెందిన వంకల సత్యం (44) ఎస్.రాయవరం మండలం వాకపాడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వారానికొకసారి ఇంటికి వెళ్లి వస్తుంటారు. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో స్వస్థలానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సరిగ్గా బయ్యవరం గ్రామ సమీపంలో ఉన్న హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం వద్ద ఉన్న జంక్షన్ వద్దకు వచ్చేసరికి పక్క నుంచి నర్సింగబిల్లి పంచాయతీ చింతలపాలెం గ్రామానికి చెందిన అప్పారావు బైకుతో ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. అయితే సత్యం మాస్టారు జాతీయ రహదారిపై పడిపోవడంతో వెనక నుంచి వచ్చిన కంటెయినర్ లారీ ఆయన పైనుంచి దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని జాతీయ రహదారి భద్రతా అధికారుల వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన అప్పారావును, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి మేనమామ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.